RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:189 | శనివారం | 08 ఆగస్టు 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

PRESS

77309 83966  98491 98098



## రాష్ట్ర సుభిక్షం కోసం
# మహా వరుణ యాగం

- నాగార్జునసాగర్‌లో ఆగస్టు 10న వైదిక క్రతువు
- వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రభుత్వ ఆధ్వర్యంలో యాగం
- 11 హోమకుండాల్లో 108 మంది ఋత్వికులు, వేద పండితులతో నిర్వహణ
- కృష్ణా, గోదావరి నదులకు భారీగా వరద నీరు రావాలని ప్రత్యేక ప్రార్థనలు
- మధ్యాహ్నం 3.24 గంటలకు పూర్ణాహుతి.. పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి

2



## నీటిపారుదల సలహా మండళ్ల పునరుద్ధరణ

- ఎల్‌నినోపై రైతులకు ముందస్తు మార్గదర్శకాలు
- సాగర్, ఎస్ఆర్ఎస్పీలో నీటి నిల్వలు ఇంకా తక్కువే
- తాగునీటి నిల్వలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం
- రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల రేషన్ స్మార్ట్ కార్డులు
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

## కేటీఆర్ బాటలో
# హరీష్ రావు

- ఇక నోటీసులతోనే సమాధానం

## కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ కొత్త కౌంటర్..

- వ్యక్తిగత ఆరోపణలపై చట్టపరమైన చర్యలకు గులాబీ పార్టీ సిద్ధం
- హరీశ్‌రావుపై క్షుద్ర పూజల ఆరోపణలతో మొదలైన వివాదం
- ఇక నేతలపై ఆధారాలు లేని వ్యాఖ్యలు చేస్తే లీగల్ నోటీసులు
- సోషల్ మీడియాలో ఆరోపణల వేగానికి ముందే అడ్డుకట్ట వేయాలన్న వ్యూహం

హైదరాబాద్, ఆగస్టు 7: తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు కొత్త మలుపు తిరుగుతోంది. ఇప్పటివరకు విమర్శలకు విమర్శలతోనే సమాధానం ఇచ్చిన బీఆర్ఎస్.. ఇక వ్యక్తిగత ఆరోపణల విషయంలో చట్టపరమైన మార్గాన్ని ఎంచుకోవాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే వెంటనే లీగల్ నోటీసులు పంపించి బాధ్యత వహించేలా చేయాలన్నది కొత్త వ్యూహంగా చెబుతున్నారు. ఇటీవల మాజీ మంత్రి హరీశ్‌రావుపై కాంగ్రెస్ నేతలు క్షుద్ర పూజలకు పాల్పడ్డారంటూ చేసిన ఆరోపణలు ఈ మార్పుకు కారణంగా మారాయి. వర్షాలు కురవకుండా ఉండేందుకు ఆయన పూజలు చేయిస్తున్నారన్న వ్యాఖ్యలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండించింది. ముఖ్యంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా ఇదే అంశంపై వ్యాఖ్యలు చేయడంతో హరీశ్‌రావు చట్టపరమైన చర్యలకు సిద్ధమయ్యారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన నేతలకు న్యాయపరమైన నోటీసులు పంపించి, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలోనూ బీఆర్ఎస్ నేతలు తమపై వ్యక్తిగత ఆరోపణలు చేసిన ప్రత్యర్థులకు న్యాయపరమైన నోటీసులు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా తనపై ఆరోపణలు చేసిన అప్పటి మంత్రి కొండా సురేఖకు

మిగతా 2వ పేజీలో..





## తెలంగాణ.. పెట్టుబడులకు గమ్యస్థానం

- బే ఏరియా పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం భట్టి పిలుపు
- అమెరికా పర్యటనలో ప్రవాస భారతీయులతో సమావేశం
- డిప్యూటీ సీఎం గౌరవార్థం భారత కాన్సుల్ జనరల్ విందు

2

- పదేళ్లు పూర్తి చేసుకున్న పథకం.. దేశానికి ఆదర్శంగా నిలిచిందన్న హరీశ్‌రావు
- ఫ్లోరోసిస్ నిర్మూలనలో మిషన్ భగీరథ కీలక పాత్ర
- 'హర్ ఘర్ జల్'కు ఈ ప్రాజెక్టే ఆదర్శమని వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పథకం నిర్వీర్యమవుతోందని ఆరోపణ

## తాగునీటి విప్లవానికి నిదర్శనం
# మిషన్ భగీరథ



హైదరాబాద్, ఆగస్టు 7: తెలంగాణలో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన మిషన్ భగీరథ పథకం పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

మిగతా 2వ పేజీలో..



## పార్లమెంట్‌లో చురుగ్గా
# వ్యవహరించండి

- ఎన్డీఏ ఎంపీలకు ప్రధాని మోదీ సూచనలు
- సభా కార్యకలాపాల్లో చురుకైన భాగస్వామ్యం
- పార్లమెంట్ చరిత్రను అధ్యయనం చేసి చర్చలకు సిద్ధం కావాలి
- రాష్ట్రాలు, నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల ఎంపీలకు అండగా ఉంటానని భరోసా

4



## జీఎస్టీ ఎగవేతకు
# ఏఐతో చెక్

- పన్నుల రాబడి పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక కసరత్తు
- వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖల్లో సంస్కరణలకు ప్రణాళిక
- నిర్మాణ రంగంలోని పన్నుల లీకేజీలను అరికట్టేందుకు శాఖల అనుసంధానం
- వ్యాపారులకు ఇబ్బంది లేకుండా సాంకేతికత వినియోగం
- అరవింద్ సుబ్రమణియన్‌తో సీఎం ప్రత్యేక సమావేశం

3

## ఫీజు వివరాలు
# నోటీసు బోర్డులో పెట్టాల్సిందే

- ప్రైవేట్ పాఠశాలలకు విద్యాశాఖ కీలక ఆదేశాలు
- తరగతుల వారీగా ఫీజుల వివరాలు బహిరంగంగా ప్రదర్శించాలి
- పాఠశాల వెబ్‌సైట్, విద్యాశాఖ పోర్టల్‌లోనూ నమోదు చేయాలి
- ఫీజుల నిర్ణయానికి సంబంధించిన పత్రాలు, పాలకవర్గ తీర్మానాలు సమర్పించాలి

2

## చేనేత సంక్షోభంపై
# కేటీఆర్ బహిరంగ లేఖ

- నిలిచిపోయిన సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి.. నేతన్నల హామీలు అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి డిమాండ్
- కేసీఆర్ హయాంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలు నిలిచిపోయాయని ఆరోపణ
- కేంద్రం తీసుకున్న నిర్ణయాలు కూడా చేనేత రంగానికి నష్టం చేశాయని వ్యాఖ్య

2



## త్వరలో డిజిటల్ అసెంబ్లీ,
# డిజిటల్ కౌన్సిల్





2

- పౌరుల డేటా భద్రతకు బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీ
- అన్ని గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ డిజిటల్ కనెక్టివిటీ
- ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాంక్లేవ్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

## అధికారులను కోర్టుకు పిలిపించడం
# బాధగా ఉంది

- ఐఏఎస్ సందీప్ సుల్తానియా కేసు విచారణలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు

3





## ములాఖత్‌ల
# మతలబు ఏమిటో?

- అంతుపట్టని బీజేపీ నేతల వరుస భేటీలు
- బండి సంజయ్ ఇంట్లో ఈటల, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భేటీ
- ముగ్గురు ఎంపీల కలయికపై పార్టీలో ఆసక్తికర చర్చ
- వరుస సమావేశాల తర్వాతే మూడు జిల్లాల అధ్యక్షుల నియామకం

2

# రాష్ట్ర సుభిక్షం కోసం మహా వరుణ యాగం

**నాగార్జునసాగర్, ఆగస్టు 7:**

తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహా వరుణ యాగం నిర్వహించనున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వాతావరణ ప్రతికూలతలు తగ్గి జలాశయాలు నిండాలని సంకల్పిస్తూ నాగార్జునసాగర్ వేదికగా ఈ వైదిక క్రతువుకు శ్రీకారం చుట్టనున్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు, వేద పండితులు, సిద్ధాంతి శాస్త్రోక్తంగా చర్చించి ఆగస్టు 10ను యాగానికి శుభ ముహూర్తంగా నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యామ్ సమీపంలోని విజయవిహార్ ప్రాంగణంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**108 మంది ఋత్వికులతో ప్రత్యేక పూజలు**

యాదగిరిగుట్ట క్షేత్రానికి చెందిన అర్చకులు, వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య యాగాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రాంగణంలో 11 హోమకుండాలను సిద్ధం చేస్తున్నారు. సుమారు 108 మంది ఋత్వికులు, వేద పండితులు క్రతువులో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కృష్ణా, గోదావరి నదుల్లోకి సమృద్ధిగా వరద నీరు చేరాలని, డ్యామ్‌లు, జలాశయాలు, చెరువులు, కుంటలు నిండాలని యాగంలో సంకల్పించనున్నారు. రాష్ట్ర రైతులకు పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు.

**ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు**

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో యాగానికి సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఆగస్టు 10న రోజంతా జరిగే వైదిక కార్యక్రమాలు మధ్యాహ్నం 3.24 గంటలకు పూర్ణాహుతితో ముగియనున్నాయి. పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి జలవనరులు నిండాలని, రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా పంటలు పండాలని ఈ సందర్భంగా యాగం ద్వారా ఆకాంక్షించనున్నారు.

# తాగునీటి విప్లవానికి నిదర్శనం మిషన్ భగీరథ

**మొదటిపేజీ తరువాయి**

సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. మిషన్ భగీరథకు సంబంధించిన ప్రత్యేక వీడియోను పంచుకున్న ఆయన.. ఇది కేవలం ప్రభుత్వ పథకం మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల తాగునీటి కష్టాలకు పరిష్కారం చూపిన మహత్తరమైన తాగునీటి విప్లవమని పేర్కొన్నారు.

**దేశానికి ఆదర్శంగా నిలిచిన ప్రాజెక్ట్**

దశాబ్దం క్రితం రూపొందించిన మిషన్ భగీరథ తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిందని హరీశ్‌రావు తెలిపారు. ప్రతి ఇంటికీ నిరంతరాయంగా స్వచ్ఛమైన నల్లా నీరు అందించేలా ఏర్పాటైన ఈ వ్యవస్థ దేశంలోనే అతిపెద్ద తాగునీటి మౌలిక వసతుల ప్రాజెక్టుగా గుర్తింపు పొందిందన్నారు. తెలంగాణను దశాబ్దాలుగా వేధించిన ఫ్లోరోసిస్ సమస్యను నిర్మూలించడంలోనూ మిషన్ భగీరథ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'హర్ ఘర్ జల్' కార్యక్రమానికి మిషన్ భగీరథ ఆదర్శంగా నిలిచిందని, దేశవ్యాప్తంగా ఈ ప్రాజెక్టుకు ప్రశంసలు లభించాయని హరీశ్‌రావు గుర్తుచేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు**

మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టి, ఆచరణాత్మక ఆలోచనలకు మిషన్ భగీరథ ప్రత్యక్ష నిదర్శనమని హరీశ్‌రావు పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పథకం నిర్వహణపై నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. గతంలో నిరంతరం నీరు సరఫరా చేసిన నల్లాలు ఇప్పుడు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మిషన్ భగీరథను ప్రభుత్వం తక్షణమే సమర్థంగా నిర్వహించి ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రజల జీవితాలతో ముడిపడిన ఈ పథకం మౌలిక లక్ష్యం దెబ్బతినకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఫీజు వివరాలు నోటీసు బోర్డులో పెట్టాల్సిందే

**హైదరాబాద్, ఆగస్టు 7:**

తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్లలో పారదర్శకత పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతి ప్రైవేట్ పాఠశాల తరగతుల వారీగా వసూలు చేసే ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిరంగపరచాలని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా పాఠశాల ప్రాంగణంలోని నోటీసు బోర్డుపై ఫీజుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు పాఠశాల అధికారిక వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచాలని ఆదేశించింది.

**విద్యాశాఖ పోర్టల్‌లోనూ నమోదు**

ఫీజుల వివరాలను విద్యాశాఖ అధికారిక పోర్టల్‌లోనూ నమోదు చేయాల్సి ఉంటుంది. ఫీజులను ఏ ప్రాతిపదికన నిర్ణయించారో తెలిపే పత్రాలతో పాటు పాలకవర్గ సభ్యుల సంతకాలతో కూడిన తీర్మాన ప్రతులను కూడా పోర్టల్‌లో దాఖలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనివల్ల పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజులపై తల్లిదండ్రులకు స్పష్టత లభించనుంది.

**ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

జీఓ ఎంఎస్ నంబర్ 1 (1994)లోని నిబంధనల ప్రకారం ఫీజుల వివరాలను ప్రదర్శించని పాఠశాలలకు జిల్లా విద్యాధికారులు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని విద్యాశాఖ స్పష్టం చేసింది. నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాలలపై అదే జీఓలోని రూల్ 11 ప్రకారం అనుమతులు లేదా గుర్తింపును రద్దు చేసే చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ ఉత్తర్వుల అమలును జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడకుండా పారదర్శకతను కాపాడాలని విద్యాశాఖ స్పష్టం చేసింది.

# కేటీఆర్ బాటలో హరీష్ రావు

**మొదటిపేజీ తరువాయి**

నోటీసులు పంపించారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యాఖ్యలను ఇకపై రాజకీయ విమర్శలుగా వదిలేయకుండా చట్టపరంగా ఎదుర్కోవాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక మాధ్యమాల ప్రభావం పెరగడంతో ఒక ఆరోపణ క్షణాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలకు చేరుతోందని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. దీనికి వివరణ ఇచ్చేలోపే నష్టం జరిగిపోతోందని, అందుకే ముందుగానే న్యాయపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా నిరాధార ప్రచారానికి అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి తమపై విమర్శలు మరింత పెరిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ అంచనా వేస్తున్నట్లు సమాచారం. ఇకపై ప్రతి ఆరోపణకు రాజకీయ ప్రకటనలతోనే స్పందించకుండా, అవసరమైన సందర్భాల్లో న్యాయపరమైన మార్గంలో గట్టి సమాధానం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం కాస్తా నోటీసుల పోరుగా మారే పరిస్థితి కనిపిస్తోంది.

# చేనేత సంక్షోభంపై కేటీఆర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 7:**

తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీకగా ఉన్న చేనేత రంగం కాంగ్రెస్ పాలనలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. గతంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**బీమా, చేయూతతో భరోసా**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలు చేనేత కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాయని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 55 వేల మందికిపైగా చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించామని తెలిపారు. కార్మికుల పొదుపును ప్రోత్సహించేలా ప్రభుత్వం తన వాటాను జమ చేసిన 'నేతన్నకు చేయూత'



పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు అందించడంతో పాటు బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాలల యూనిఫారాల తయారీకి ఆర్డర్లు ఇవ్వడం ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించామని కేటీఆర్ గుర్తుచేశారు.

**కాంగ్రెస్ హామీలపై ప్రశ్నలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత సంక్షేమ పథకాలను నిలిపివేసిందని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. చేనేత భరోసా కింద ఏటా రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సాయం, వ్యక్తిగత రుణమాఫీ, సహకార సంఘాల రుణమాఫీ, జీఎస్టీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్న హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. రెండున్నరేళ్లు గడిచినా నేతన్నల జీవితాల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదని కేటీఆర్ పేర్కొన్నారు.

**కేంద్రంపైనా విమర్శలు**

చేనేత రంగంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా నిర్లక్ష్య వైఖరి అవలంబించిందని కేటీఆర్ ఆరోపించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డుల రద్దు, పలు సంక్షేమ పథకాల నిలిపివేత, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ వంటి నిర్ణయాలు రంగాన్ని దెబ్బతీశాయని అన్నారు. చేనేత విషయంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల విధానాల్లో పెద్దగా తేడా లేదని విమర్శించారు.

**పథకాలు పునరుద్ధరించాలని డిమాండ్**

నేతన్నల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కేటీఆర్ కోరారు. గతంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరించి, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చేనేత భరోసా, రుణమాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నికల హామీలను అమలు చేసి నేతన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు.

నేతన్నల జీవనోపాధిని కాపాడితేనే చేనేత రంగం, తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవం నిలుస్తాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.

# ములాఖత్‌ల మతలబు ఏమిటో?

**హైదరాబాద్, ఆగస్టు 7:**

తెలంగాణ బీజేపీలో కొంతకాలంగా కనిపిస్తున్న అంతర్గత విభేదాలకు భిన్నంగా వరుసగా చోటుచేసుకుంటున్న నేతల భేటీలు ఇప్పుడు పార్టీలో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసంలో ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమావేశమై ఆత్మీయంగా మాట్లాడుకోవడం, అనంతరం మూడు జిల్లాల పార్టీ అధ్యక్షుల నియామకాలు పూర్తవడం వెనుక అసలు మతలబేంటన్న చర్చ మొదలైంది.

బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారం చాలాకాలంగా పార్టీలో ఉంది. కొండా విశ్వేశ్వర్‌రెడ్డితోనూ కొన్ని అంశాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన సందర్భాలు ఉన్నాయి. అలాంటి నేతలు ఒకే ఇంట్లో సమావేశమై కలిసి భోజనం చేయడం పార్టీ శ్రేణులకు కొత్త దృశ్యంగా మారింది.

ఈ భేటీకి ముందే తెలంగాణ బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ ఢిల్లీలో పలువురు ఎంపీలతో సమావేశమైనట్లు సమాచారం. ఆ తర్వాత బండి సంజయ్ నివాసంలో ఈటల, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భేటీ కావడం, ఆ వెంటనే నెలలుగా పెండింగ్‌లో ఉన్న మూడు జిల్లాల అధ్యక్ష పదవులను భర్తీ చేయడం వరుస పరిణామాలపై ఆసక్తిని పెంచింది. సమావేశంలో పార్టీ సీనియర్ నేత లక్ష్మణ్ కూడా పాల్గొన్నట్లు



సమాచారం.

**మూడు పదవుల వెనుక ఏం జరిగింది?**

తెలంగాణ బీజేపీలో 38 సంస్థాగత జిల్లాలు ఉన్నాయి. ఇప్పటికే 36 జిల్లాల అధ్యక్షుల నియామకాలు పూర్తయ్యాయి. మిగిలిన మూడు జిల్లాల అధ్యక్ష పదవులు మాత్రం నేతల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి.

కరీంనగర్‌లో బండి సంజయ్, మేడ్చల్ అర్బన్‌లో ఈటల రాజేందర్ తమకు అనుకూలమైన వ్యక్తులకు అవకాశం కల్పించాలని పట్టుబట్టినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరిగింది. దీంతో నియామక ప్రక్రియ ముందుకు సాగలేదు. తాజాగా మూడు జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించడంతో ఈ వివాదానికి ముగింపు పలికినట్లయింది. కొత్తగా నియమితులైన వారిలో ఎంపీలు సూచించిన వ్యక్తులకే అవకాశం దక్కిందన్న ప్రచారం కూడా పార్టీలో జరుగుతోంది. దీంతో ఇన్నాళ్లుగా కొనసాగిన పీటముడి ఎలా వీడింది? నేతల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందా? లేక ఎవరి పంతం వారికి నెరవేరిందా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

**వరుస భేటీల వెనుక సయోధ్యేనా?**

మూడు జిల్లాల అధ్యక్షుల నియామకానికి ముందు చోటుచేసుకున్న కీలక భేటీలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్య నేతల మధ్య దూరాన్ని తగ్గించేందుకు పార్టీ అధిష్ఠానం నుంచి ఏదైనా ప్రయత్నం జరిగిందా? రాష్ట్రంలో పార్టీని మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు నేతల మధ్య అవగాహన కుదిరిందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అయితే భేటీల్లో ఏ అంశాలపై చర్చ జరిగిందన్నది మాత్రం అధికారికంగా వెల్లడికాలేదు. రాజకీయంగా ఎలాంటి కొత్త సమీకరణాలు రూపుదిద్దుకుంటున్నాయన్నది కూడా స్పష్టత లేదు. ఇన్నాళ్లూ ఎడముఖం పెడముఖంగా కనిపించిన నేతలు ఒకే చోట కూర్చొని మాట్లాడుకోవడం మాత్రం పార్టీకి సానుకూల పరిణామమేనని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ కలయిక కేవలం జిల్లాల అధ్యక్షుల నియామకానికే పరిమితమా? లేక రాబోయే రోజుల్లో రాష్ట్ర బీజేపీలో విభేదాలకు చెక్ పెట్టే కొత్త అధ్యాయానికి నాందియా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్

**ఢిల్లీ, ఆగస్టు 7:**

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. అధికారం చేపట్టే విషయంలో ఎవరితోనూ పొత్తు ఉండదన్నారు. జనసేన సహా ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని తేల్చి చెప్పారు. అయితే ఎన్డీయే కూటమిలో జనసేన భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. రామచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలతో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ దిల్లీలో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై కీలకంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ జరిగింది. అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని, 937 మండలాల్లో పార్టీని బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీదే గెలుపని, కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో ఇక్కడా విజయం సాధించి అధికారం చేపడతామన్నారు. రాష్ట్రంలోని కీలక నేతలంతా బీజేపీలో చేరేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని రామచందర్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని, కలిసి పోరాటం చేయాలని నితిన్ నబిన్ దిశానిర్దేశం చేశారన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నితిన్ నబిన్ రాష్ట్రానికి వస్తారని, ఇక్కడి నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. ప్రజా సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడతామన్నారు. ఈ సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ వంటి నేతలు కూడా పాల్గొన్నారు.

# త్వరలో డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్

**హైదరాబాద్, ఆగస్టు 7 :**

రాష్ట్రంలో త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గవ్ కనెక్ట్(GOVconnect), ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ(మీసేవ) సంయుక్త ఆధ్వర్యంలో బేగంపేటలో శుక్రవారం నిర్వహించిన ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాంక్లేవ్ (తెలంగాణ)ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాలనలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. పౌర సేవల్ని మరింత సమర్థవంతంగా ప్రజల ముంగిటకే చేర్చేలా ఏఐ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఎమర్జింగ్ టెక్నాలజీలకు పాలనలో పెద్ద పీట వేస్తున్నామన్నారు. డిజిటల్ కేబినెట్, 20 ప్రభుత్వ శాఖలను ఒకే తాటిపైకి తెచ్చేలా రియల్ టైమ్ గవర్నమెంట్ డ్యాష్‌బోర్డు, దేశంలోనే తొలి ఏఐ ఆధారిత డేటా ఎక్స్ఛేంజ్, వాట్సాప్ ద్వారా పౌర సేవల డెలివరీ, మీ టికెట్ వంటి ఎన్నో విప్లవాత్మక సంస్కరణల ద్వారా డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిపామన్నారు. పౌరుల డేటా భద్రతకు పెద్ద పీట వేసేలా త్వరలోనే బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్ల జారీకి శ్రీకారం చుడతామన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలకు టీ ఫైబర్ ద్వారా హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పౌర సేవలను నేరుగా వారి ఇంటి ముంగిటకే అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్టు




ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పూర్తిస్థాయిలో పేపర్‌లెస్ అడ్మినిస్ట్రేషన్ అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎంవో చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్, మిత్రా సీఈవో ప్రవీణ్ పరదేశి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఎండీ జీవీఎల్ సత్య కుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సీఈవో డా. దేవేష్ త్యాగి, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ అడిషనల్ సెక్రటరీ సౌరభ్ కె.తివారీ తదితరులు పాల్గొన్నారు.

# నీటిపారుదల సలహా మండళ్ల పునరుద్ధరణ

**హైదరాబాద్, ఆగస్టు 7:**

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతుల ప్రయోజనాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లా నీటిపారుదల సలహా మండళ్లను తక్షణమే పునరుద్ధరించాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అటవీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర సంబంధిత వర్గాలతో కూడిన జిల్లా నీటిపారుదల సలహా మండళ్లు ప్రతి పంట కాలానికి ముందు, పంట సీజన్‌లో తప్పనిసరిగా సమావేశమై జలాశయాల నీటి నిల్వలు, ఆశించదగిన నీటి ప్రవాహాలు, స్థానిక వర్షపాతం, తాగునీటి అవసరాలు, కమాండ్ ఏరియాల్లోని సాగు పరిస్థితులను సమగ్రంగా సమీక్షించి రైతులకు శాస్త్రీయమైన, విశ్వసనీయమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వీలైన జిల్లాల్లో రేపటి నుంచే నీటిపారుదల సలహా మండళ్ల సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ మండళ్లు కేవలం నీటి విడుదలలపై నిర్ణయాలు తీసుకునే వేదికలు మాత్రమే కాకుండా రైతులు ఏ పంట వేస్తే భవిష్యత్తులో నష్టపోకుండా ఉంటారో ముందుగానే తెలియజేసే బాధ్యతాయుతమైన వ్యవస్థగా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న జలాశయాల నీటి నిల్వలు, రుతుపవనాల మిగిలిన కాలంలో వర్షపాతం అంచనాలను పరిశీలిస్తే అత్యంత జాగ్రత్తతో పంటల ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాజెక్టుల కింద రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలను సాగు చేయవద్దని ఆయన స్పష్టంగా హెచ్చరించారు. ఆగస్టు తొలి వారంలో కురిసిన వర్షాలతో కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఆ వర్షాలను ఆధారంగా చేసుకుని రైతులు వరి సాగుకు వెళ్లడం సముచితం కాదన్నారు. ఒకసారి తడిపే అవకాశం లభించినా, రెండోసారి నీరు అందించే పరిస్థితి అనిశ్చితంగా మారే అవకాశం ఉందని, ప్రస్తుతం ప్రోత్సహించి రైతులను పంట వేయించి రెండుమూడు నెలల తర్వాత ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. ప్రతి కమాండ్ ఏరియాలో ఎంతమేర సాగునీరు అందించగలమో, ఎక్కడ పరిమితులు ఉన్నాయో కలెక్టర్లు, నీటిపారుదల ఇంజినీర్లు, వ్యవసాయ అధికారులు రైతులకు అధికారికంగా తెలియజేయాలని సూచించారు. ప్రధాన జలాశయాల పరిస్థితిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ సూచించారు. ముఖ్యంగా నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు ఇంకా ఆశించిన స్థాయికి చేరుకోలేదంటూ ఆయా కమాండ్ ఏరియాల్లో నేల స్వభావం, నీటి లభ్యత, వ్యవసాయ శాఖ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని ఆయన ఆదేశించారు. వచ్చే వేసవిలో రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి సంక్షోభం తలెత్తకుండా ఇప్పటి నుంచే అవసరమైన నీటి నిల్వలను పరిరక్షించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. స్థానిక లేదా రాజకీయ ఒత్తిళ్లకు లోనై విచక్షణారహితంగా నీటిని విడుదల చేయరాదని హెచ్చరిస్తూ గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీర్ఇన్‌చీఫ్, నీటిపారుదల శాఖ ఇంజినీర్ఇన్‌చీఫ్(జనరల్) ఓ.వి. రమేష్ బాబుతో సమన్వయం చేసుకుని భవిష్యత్తు తాగునీటి అవసరాలకు తప్పనిసరిగా ఎంత నీటిని నిల్వ ఉంచాలనే అంశాన్ని నిర్ణయించాలని ఆదేశించారు.

# జీఎస్టీ ఎగవేతకు ఏఐతో చెక్

హైదరాబాద్, ఆగస్టు 7:

రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు పన్నుల ఎగవేతకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సాంకేతికతను విస్తృతంగా వినియోగించనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో సమావేశమై వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై చర్చించారు. జీఎస్టీ రాబడులను పెంచడం, పన్నుల లీకేజీలను గుర్తించడం కోసం కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.

**నిర్మాణ రంగంపై ప్రత్యేక దృష్టి**

భవన నిర్మాణ రంగంలో పన్నుల ఎగవేతకు అవకాశం లేకుండా వివిధ ప్రభుత్వ శాఖలను అనుసంధానం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. మున్సిపల్, రేరా, పంచాయతీరాజ్, విద్యుత్, వాణిజ్య పన్నుల శాఖల సమాచారాన్ని కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థ ద్వారా సమన్వయం చేయనున్నారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు అనుమతులు ఇచ్చే దశలోనే నిర్మాణ సామాగ్రి అవసరాలు, వాటికి సంబంధించిన పన్నుల అంచనాలను నమోదు చేసేలా వ్యవస్థను రూపొందించనున్నారు.

**వ్యాపారులకు ఇబ్బంది లేకుండా..**

పన్నుల వసూళ్లు పెంచే క్రమంలో వ్యాపారులను అనవసరంగా ఇబ్బంది పెట్టకూడదని సీఎం స్పష్టం చేశారు. సులభతర వాణిజ్యానికి ప్రాధాన్యం ఇస్తూనే పన్నుల విధానాన్ని సరళీకరించాలని సూచించారు. అధికారులకు అవసరమైన సమాచారాన్ని కృత్రిమ మేధ ద్వారా వేగంగా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తనిఖీలు, పన్నుల వసూళ్లను మరింత సమర్థంగా నిర్వహించవచ్చని అరవింద్ సుబ్రమణియన్ వివరించారు.

**ప్రభుత్వ సేవల సమాచారాన్ని ఒకే చోటకు..**

పన్నులకు సంబంధించిన సమాచారంతో పాటు మీ సేవ, ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి పథకాల వివరాలను కూడా సమగ్ర సమాచార వ్యవస్థలోకి తీసుకురావాలని సీఎం సూచించారు. దీనివల్ల ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణలో పారదర్శకత పెరగడంతో పాటు నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ఎక్సైజ్ కార్యదర్శి రఘునందన్‌రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అధికారులను కోర్టుకు పిలిపించడం బాధగా ఉంది

హైదరాబాద్, ఆగస్టు 7:

కోర్టు ధిక్కరణ వ్యవహారంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా హైకోర్టు ముందు వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యారు. కేసు విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సందీప్ సుల్తానియాపై వెయ్యి కేసులు ఉన్నాయని, అవన్నీ విచారణ చేస్తే జీవిత కాలం జైల్లో ఉండాలని పేర్కొంది. ప్రభుత్వాలు చేసిన తప్పు వల్ల అధికారులకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. అధికారులను హైకోర్టుకు పిలిపించడం బాధగా ఉందని, తప్పని పరిస్థితుల్లో హాజరుకావాలని ఆదేశిస్తున్నామని న్యాయస్థానం తెలిపింది. ఉచిత పథకాల వల్ల చాలా ప్రమాదం ఉందని, రైతుబంధు అనేది సంపన్నులు, అధికారులు కూడా తీసుకుంటున్నారని, ఇది చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. రైతుబంధుతో రాష్ట్ర ఖజానాకు భారమని హైకోర్టు వ్యాఖ్యానించింది

## 15న 1.06 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 7 :

రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవం నాడు సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 3.42 కోట్ల మంది అర్హులైన లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా ప్రతి అర్హుడికి ప్రతి నెల 6 కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందించనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అమలుకు ప్రతి నెలా సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లా కలెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని సంగారెడ్డిలో ముఖ్యమంత్రి ప్రారంభించడంతోపాటు రాష్ట్రంలోని మిగిలిన 32 జిల్లాల్లోనూ అదే రోజు ఏకకాలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతను మరింత బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం ఒక చరిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన ఆహార భద్రతను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. దేశంలో అత్యంత సమర్థవంతమైన ఆహార భద్రతా కార్యక్రమాల్లో ఒకటైన ఈ మహత్తర కార్యక్రమంలో చిన్న పాత్ర పోషించడం ఆనందదాయకంగా ఉందన్నారు.

## తెలంగాణ.. పెట్టుబడులకు గమ్యస్థానం

శాన్ ఫ్రాన్సిస్కో, ఆగస్టు 7 :

పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు తెలంగాణ రాష్ట్రాన్ని తమ తొలి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన గౌరవార్థం శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సుల్ జనరల్ కె.శ్రీకర్ రెడ్డి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి బే ఏరియాలోని ప్రముఖ ప్రవాస భారతీయులతోపాటు ఐటీ, వైద్య, మానవ వనరులు, ఇతర వ్యాపార రంగాలకు చెందిన విశిష్ట నాయకులు హాజరయ్యారు. భట్టి విక్రమార్క ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణను, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు. ఐటీ ఆవిష్కరణల్లో హైదరాబాద్ అగ్రగామి. టెక్నాలజీ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ సర్వీసెస్ రంగాలలో భారతదేశపు ప్రముఖ కేంద్రాలలో ఒకటిగా హైదరాబాద్ ఎదుగుతోందని గుర్తుచేశారు. ఈ వృద్ధి వేగాన్ని ఇలా కొనసాగిస్తూనే అభివృద్ధి చెందుతున్న సరికొత్త రంగాల్లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కోసం కొత్త పునాదులు వేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం పారదర్శకమైన, పెట్టుబడులకు అనుకూలమైన ప్రగతిశీల అభివృద్ధి నమూనాను అనుసరిస్తోందన్నారు. కొత్త ఆలోచనలను సంస్థలుగా మార్చడంలో, నాణ్యమైన ఉపాధిని సృష్టించడంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అడుగులు వేయాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పలు కీలక కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సభకు వివరించారు. చారిత్రక మూసీ నది పునరుద్ధరణ, సమగ్ర పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. తెలంగాణ యువతను భవిష్యత్ ఉద్యోగాలకు, ప్రపంచస్థాయి పోటీకి సన్నద్ధం చేసేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతోపాటు అత్యాధునిక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.



**డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం**

శాన్ ఫ్రాన్సిస్కో చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు విమానాశ్రయంలో అపూర్వ స్వాగతం లభించింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన శాన్ ఫ్రాన్సిస్కో భారత కాన్సులేట్ జనరల్ నహజ్ అలీ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అలాగే ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు, ప్రవాస తెలంగాణవాసులు, అభిమానులు పెద్ద ఎత్తున విమానాశ్రయానికి తరలివచ్చి తమ అభిమాన నాయకుడికి బ్రహ్మరథం పట్టారు.

**దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి : కాన్సుల్ జనరల్**

తొలుత సభికులకు స్వాగతం పలికిన కాన్సుల్ జనరల్ శ్రీకర్ రెడ్డి ప్రవాస భారతీయులు, ప్రభుత్వాల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. భారత్‌లో సమ్మిళిత ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడుతూనే ప్రవాసులకు సైతం ప్రయోజనం చేకూర్చేలా బలమైన భాగస్వామ్యాలను అన్వేషించాలని వ్యాపార వర్గాలను కోరారు. సమావేశం అనంతరం పెట్టుబడులు, సాంకేతిక సహకారం, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ఆవిష్కరణలు తదితర అంశాలపై ఎన్నారైలు, బే ఏరియా ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రాష్ట్రంతో అమెరికాలోని ప్రవాస భారతీయుల మధ్య బలమైన సంస్థాగత సంబంధాలు ఏర్పరచుకునే దిశగా ఈ సదస్సులో అర్థవంతమైన చర్చలు జరిగాయి. కార్యక్రమంలో సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఐవోసీ నాయకులు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భర్తను హత్య చేయించేందుకు భార్య కుట్ర!

- ప్రియుడితో కలిసి రోడ్డు ప్రమాదం సృష్టించాలని పథకం..
- చాటింగ్ ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు

మహబూబాబాద్, ఆగస్టు 7:

దాంపత్య బంధాన్ని మరిచి ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించేందుకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు రావడం మహబూబాబాద్ జిల్లా దోర్నకల్లు మండలంలో కలకలం రేపింది. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి భర్తను హతమార్చాలని ప్రియుడితో ఆమె చేసిన చాటింగ్ వెలుగులోకి వచ్చినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన ప్రాణాలకు ముప్పు ఉందంటూ భార్యతో పాటు ఆమె ప్రియుడు పురిమెట్ల సైదులుపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

**చాటింగ్‌లో వెలుగులోకి వచ్చిన కుట్ర**

దోర్నకల్లు మండలం చిలుకోడు గ్రామానికి చెందిన గాదే రాజేశ్వరరావు ప్రస్తుతం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సాయిప్రభాత్ నగర్‌లో నివసిస్తూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. 2016లో సూర్యాపేట జిల్లా మోతె మండలానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.
జూలై 27న భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లిన సమయంలో తన భార్య మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండటాన్ని గుర్తించినట్లు రాజేశ్వరరావు ఫిర్యాదులో తెలిపాడు. ఈ విషయంపై కుటుంబ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నాడు. మరుసటి రోజు తన అన్నను తీసుకురావడానికి వెళ్లిన సమయంలో ఓ వ్యక్తి తనను వెంబడించినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. అనంతరం భార్య ఫోన్‌ను పరిశీలించగా ప్రియుడితో ఆమె జరిపిన సంభాషణలు బయటపడినట్లు తెలిపాడు. తనను ఎలాగైనా హత్య చేయించాలని ఆమె ప్రియుడితో చాటింగ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. రోడ్డు ప్రమాదం జరిగేలా చేసి తనను అంతమొందించాలని ఆమె ఒత్తిడి చేసినట్లు చాటింగ్‌లో ఉన్నట్లు ఆరోపించాడు.

**జీరో ఎఫ్ఐఆర్ నమోదు**

తన ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొంటూ రాజేశ్వరరావు దోర్నకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఖమ్మం గ్రామీణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అనంతరం బాధితుడు ఖమ్మం గ్రామీణ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాడు. కేసులో సమర్పించిన మొబైల్ చాటింగ్, ఇతర డిజిటల్ ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఆరోపణలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి, ఆధారాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవాలి

హైదరాబాద్, ఆగస్టు 7:

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితులను సవాళ్లుగా కాకుండా కొత్త అవకాశాలుగా మలచుకోవాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. సంక్షోభ సమయాల్లో కొత్త సాంకేతికత, నాణ్యత, ఆవిష్కరణలపై పెట్టుబడులు పెట్టే పరిశ్రమలే భవిష్యత్తులో మార్కెట్‌ను శాసిస్తాయన్నారు. పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో హిప్లెక్స్2026 (Hyderabad International Plastics Expo2026) ప్లాస్టిక్స్, పాలిమర్స్, ప్రాసెసింగ్ టెక్నాలజీ, యంత్రాల అంతర్జాతీయ ప్రదర్శనను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల ప్రదర్శనల్లో తనకు యంత్రాలు మాత్రమే కనిపించవని, వాటి వెనుక వేలాది కుటుంబాల జీవనోపాధి, దేశాభివృద్ధికి కృషి చేస్తున్న పారిశ్రామికవేత్తల సంకల్పం, యువత భవిష్యత్తు కనిపిస్తాయని అన్నారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పెట్టుబడులు, విస్తరణ, ఆవిష్కరణలను కొనసాగిస్తున్న పరిశ్రమల ఆత్మవిశ్వాసమే భారతదేశ బలమని చెప్పారు.

**పాలిమర్ రంగం దేశ తయారీ రంగానికి వెన్నెముక**

ప్లాస్టిక్స్, పాలిమర్ పరిశ్రమ దేశ తయారీ రంగంలో అత్యంత కీలకమైందని మంత్రి తెలిపారు. గృహ నిర్మాణం, తాగునీటి సరఫరా, వ్యవసాయం, వైద్యరంగం, ఔషధ తయారీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఆహార ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల రంగాలకు అవసరమైన ముడి పదార్థాలను ఈ రంగమే అందిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఈ పరిశ్రమ ద్వారా 50 లక్షల మందికి ప్రత్యక్షంగా, కోటి మందికి పైగా పరోక్షంగా ఉపాధి లభిస్తోందని, తెలంగాణలోనే ఈ రంగంపై సుమారు రెండు లక్షల మంది జీవనోపాధి ఆధారపడి ఉందని వివరించారు. పాలిమర్ రంగం అభివృద్ధి చెందితే తయారీ రంగం విస్తరిస్తుందని, దాంతో ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు.




**మందగమనం తాత్కాలికమే.. పరిశ్రమల ధైర్యం శాశ్వతం**

గత ఆర్థిక సంవత్సరంలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల, పాలిమర్ ధరల అస్థిరత, రవాణా, విద్యుత్ వ్యయాల పెరుగుదల, కార్మికుల కొరత వంటి అంశాలు పరిశ్రమపై ప్రతికూల ప్రభావం చూపాయని మంత్రి పేర్కొన్నారు. దేశ జీడీపీ వృద్ధికి సమాంతరంగా అభివృద్ధి చెందే పాలిమర్ రంగం గత ఏడాది కేవలం 2.4 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేసిందన్నారు. పీవీసీ పైపులు, హెచ్‌డీపీఈ పైపులు, ఆటోమొబైల్ రంగాలకు సంబంధించిన ఉత్పత్తుల్లో మందగమనం కనిపించినప్పటికీ పరిశ్రమల్లో విశ్వాసం ఏమాత్రం తగ్గలేదని అన్నారు. హిప్లెక్స్2026కు లభించిన విశేష స్పందనే దేశ పారిశ్రామిక రంగం భవిష్యత్తుపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. చరిత్ర చెబుతున్నదేమిటంటే సంక్షోభ సమయాల్లోనే గొప్ప పరిశ్రమలు ఆవిర్భవిస్తాయని వ్యాఖ్యానించారు.

**సమగ్ర ప్రతిపాదనలు ఇస్తే పరిశీలిస్తాం**

పరిశ్రమలతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు. ఏఐపీఎంఏ, టాప్మా, ఐపీఐ వంటి పరిశ్రమల సంఘాలు విధానపరమైన అంశాలు, మౌలిక సదుపాయాల అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర ప్రతిపాదనలు అందిస్తే ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి విధానపరమైన సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. పరిశ్రమలతో నిరంతర సంప్రదింపులే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

**పాలిమర్ రంగంలోనూ తెలంగాణకు అగ్రస్థానం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ దేశంలోనే పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో సాధించిన విజయాలను పాలిమర్ రంగంలోనూ పునరావృతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్లాస్టిక్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్, మెడికల్ ప్లాస్టిక్స్, ప్యాకేజింగ్ టెక్నాలజీలు, పాలిమర్ కాంపౌండింగ్, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ, ఈవీ విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్ తయారీ, బయో ఆధారిత పాలిమర్ల రంగాల్లో తెలంగాణకు అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

**2030 నాటికి 20 లక్షల టన్నుల వినియోగ లక్ష్యం**

ప్రస్తుతం తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో కలిపి సుమారు 13 లక్షల టన్నుల పాలిమర్ వినియోగం ఉందని, ప్రభుత్వంపరిశ్రమలు సమన్వయంతో పనిచేస్తే 2030 నాటికి ఇది 20 లక్షల టన్నులకుపైగా చేరుతుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. మౌలిక వసతులు, నైపుణ్య మానవ వనరులు, పారిశ్రామిక వాతావరణం తెలంగాణలో ఉన్నందున దేశంలోనే ప్రముఖ పాలిమర్ తయారీ, ప్రాసెసింగ్ కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, పారిశ్రామిక అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాలని పేర్కొంటూ గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ విధానాలను అనుసరించే పరిశ్రమలకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. పెట్టుబడులు కొనసాగిస్తూ ఉపాధి అవకాశాలను సృష్టించాలని, ప్రతి అడుగులోనూ ప్రభుత్వం పరిశ్రమలకు అండగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రదర్శనలో 550కు పైగా ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులు, అత్యాధునిక సాంకేతికతలను ప్రదర్శించనుండగా భారత్‌తోపాటు విదేశాల నుంచి 50వేలకు పైగా వ్యాపార సందర్శకులు హాజరుకానున్నారు. ఈ ప్రదర్శనలో గుజరాత్‌కు చెందిన సుమారు 160 కంపెనీలు, తెలంగాణ, ఏపీలకు చెందిన 110 ఎగ్జిబిటర్లు, చైనాకు చెందిన దాదాపు 40 కంపెనీలు పాల్గొంటున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో టాప్మా అధ్యక్షుడు నరేంద్ర బద్వా, హిప్లెక్స్ కన్వీనర్ మీలా జయదేవ్, ఏఐపీఎంఏ ఉపాధ్యక్షుడు వెన్నం అనిల్ రెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేనేతకు ఆధునిక సాంకేతికత.. నేతన్నలకు మరింత అండ

- 2030 నాటికి వస్త్ర ఎగుమతులను రూ.9 లక్షల కోట్లకు పెంచే లక్ష్యం
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన
- వరంగల్‌లో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు
- పీఎల్ఐ, ముద్ర రుణాలు, ముడిసరుకు పథకాలతో నేత కార్మికులకు ప్రోత్సాహం
- చేనేతలో ఏఐ, ఆటోమేషన్ వినియోగంతో ఉత్పాదకత పెంపు



హైదరాబాద్, ఆగస్టు 7:

చేనేత, వస్త్ర పరిశ్రమను మరింత బలోపేతం చేసి భారతదేశాన్ని ప్రపంచ వస్త్ర కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. వ్యవసాయం తర్వాత దేశంలో అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న రంగాల్లో చేనేత, వస్త్ర పరిశ్రమ కీలకమైనదని పేర్కొన్నారు. ఈ రంగం ద్వారా దాదాపు ఐదు కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోందని తెలిపారు.

**2030 నాటికి రూ.9 లక్షల కోట్ల ఎగుమతులు**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 'మేక్ ఇన్ ఇండియా'తో పాటు 5ఎఫ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి వివరించారు. పొలం నుంచి నార, నార నుంచి వస్త్రం, వస్త్రం నుంచి ఫ్యాషన్, ఫ్యాషన్ నుంచి విదేశీ మార్కెట్ల వరకు సమగ్ర అభివృద్ధి సాధించడమే ఈ విధానం లక్ష్యమన్నారు. 2030 నాటికి వస్త్ర ఎగుమతులను రూ.9 లక్షల కోట్లకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

**నేతన్నలకు పథకాలతో ప్రోత్సాహం**

ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం, పీఎం మిత్ర పార్కులు, జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం, ముడిసరుకు సరఫరా పథకం, వీవర్స్ ముద్రా పథకం ద్వారా నేత కార్మికులకు ఆధునిక మగ్గాలు, ముడిసరుకు, రుణాలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సామాజిక భద్రతను కూడా బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.

**వరంగల్‌లో పీఎం మిత్ర పార్క్**

తెలంగాణలోని వరంగల్‌లో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. పత్తి రైతులకు మద్దతు ధర కల్పించే చర్యల్లో భాగంగా కేంద్రం ఇప్పటివరకు రూ.69,860 కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. రైతుల నుంచి ముడిసరుకు సేకరణ నుంచి వస్త్ర తయారీ, ఎగుమతుల వరకు మొత్తం వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. చేనేత రంగంలో కృత్రిమ మేధ, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా ఉత్పాదకత, నాణ్యతను పెంచుతున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. సంప్రదాయ చేనేత కళను కాపాడుతూ నేతన్నలకు అండగా నిలవడానికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. దేశ ప్రజలు చేనేత వస్త్రాలను ఎక్కువగా వినియోగించి నేత కార్మికులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

# అమెరికాలో జన్మ హక్కు పౌరసత్వం అంత ఈజీ కాదు

- **కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 7:**

అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు. ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు), ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని టెరిటరీలలో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఇక, రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక్'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.




# మెటాకు రూ.5,400 కోట్ల జరిమానా

- **అమెరికా కోర్టు భారీ షాక్**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 7 :**

సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు కంపెనీకి 567 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 5,400 కోట్లకు పైగా) జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. తీర్పు ప్రకారం జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి లో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. అయితే, ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది. అమెరికాలోని చిల్డ్రన్స్ ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్(సీఓపీపీఏ) ప్రకారం కేవలం వయసు నిర్ధారణ కోసం పిల్లల నుంచి వ్యక్తిగత సమాచారం సేకరించడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. అంతేగాక ఇతర సోషల్ మీడియా కంపెనీలకు లేని నిబంధనలను మెటాపై మాత్రమే విధించడం సరికాదని, అది కంపెనీపై అనవసర భారం మోపుతుందని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై మెటా ఇంకా స్పందించలేదు. ఇటీవల మెటాకు చెందిన ఏఐ మోడల్ సైబర్ సెక్యూరిటీ పరీక్షల్లో భాగంగా బయటి సర్వీస్‌లోకి హ్యాక్ చేయడం, టెక్నాలజీపై నియంత్రణకు సంబంధించి కొత్త ఆందోళనలను రేకెత్తించింది.

# వందేమాతరానికి జాతీయ గీతంతో సమాన హోదా

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:**

భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రజల్లో దేశభక్తిని రగిలించిన 'వందేమాతరం' గీతానికి అత్యున్నత అధికారిక గుర్తింపు లభించింది. వందేమాతరానికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన హోదా కల్పించేలా రూపొందించిన కొత్త చట్టానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. దీంతో బిల్లు చట్టరూపం దాల్చినట్లు పేర్కొంటున్నారు.

**అవమానిస్తే కఠిన చర్యలు**

కొత్త చట్టం ప్రకారం వందేమాతరం గీతాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం, బహిరంగంగా అవమానించడం లేదా హేళన చేయడం తీవ్రమైన నేరంగా పరిగణించే నిబంధనలు అమల్లోకి రానున్నాయి. పాఠశాలలు, ప్రభుత్వ కార్యక్రమాలు, బహిరంగ సభల్లో గీతాలాపన జరుగుతున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.



**జాతీయ భావనకు ప్రాధాన్యం**

జనగణమన ఆలాపన సమయంలో పాటించే విధంగానే వందేమాతరం విషయంలోనూ గౌరవం, క్రమశిక్షణ పాటించేలా నిబంధనలు రూపొందించినట్లు తెలుస్తోంది. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వందేమాతరానికి అధికారికంగా సమాన హోదా కల్పించడం ద్వారా జాతీయ భావనను మరింత బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంటున్నారు.

# పార్లమెంట్‌లో చురుగ్గా వ్యవహరించండి

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాల ఆందోళనలు, సభా కార్యకలాపాలకు పదేపదే అంతరాయాలు ఎదురవుతున్న నేపథ్యంలో అధికార ఎన్డీఏ కూటమి లోక్‌సభ సభ్యులతో ప్రధాని నరేంద్ర మోదీ అల్పాహార సమావేశం నిర్వహించారు. సభలో ఎంపీలు చురుగ్గా పాల్గొని తమ అభిప్రాయాలను సమర్థంగా వినిపించాలని సూచించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ ప్రజాస్వామ్యానికి అత్యున్నత వేదిక అని పేర్కొంటూ, సభలో జరుగుతున్న అంతరాయాలపై మోదీ ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. గందరగోళం కారణంగా కొత్తగా ఎన్నికైన ఎంపీలకు తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం తగ్గుతోందని మోదీ పేర్కొన్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ చరిత్రను అధ్యయనం చేసి, గతంలో జరిగిన కీలక చర్చలు, పరిణామాలను అర్థం చేసుకుని వాటిని ప్రస్తుత చర్చలకు ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్రాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, రాష్ట్రాలు పురోగమిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులను వేగంగా చేపట్టేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.

**భాగస్వామ్య పక్షాలకు భరోసా**

సమావేశానికి ఎన్డీఏలోని వివిధ భాగస్వామ్య పార్టీలకు చెందిన 40 మందికిపైగా లోక్‌సభ ఎంపీలు హాజరైనట్లు సమాచారం. శివసేన, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే), రాష్ట్రీయ లోక్ మోర్చా, అన్నాడీఎంకే, యూపీపీఎల్ తదితర పార్టీల సభ్యులు పాల్గొన్నారు.

ఇటీవల తృణమూల్ కాంగ్రెస్ నుంచి వైదొలిగి ఎన్సీపీఐలో చేరిన ఎంపీలు, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) నుంచి బయటకు వచ్చి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన ఎంపీలతో మోదీ ప్రత్యేకంగా మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా వారికి అండగా



ఉంటానని భరోసా ఇచ్చినట్లు సమాచారం. ఎన్డీఏ ఒక కుటుంబం వంటిదని, కూటమిలోని ప్రతి భాగస్వామ్య పార్టీకి సమాన గౌరవం, అవకాశాలు ఉంటాయని స్పష్టం చేసినట్లు వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గాల అభివృద్ధి పనులకు అవసరమైన సహకారం కోసం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఎంపీలకు సూచించారు. పేదలు, కార్మికులు, రైతులు సహా వివిధ వర్గాల ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. సమావేశం ముగిసిన అనంతరం ఎంపీలతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

**బీజేపీ ఎంపీలతోనూ భేటీ**

వర్షాకాల సమావేశాల సందర్భంగా ఎన్డీఏ ఎంపీలతో మోదీ నిర్వహిస్తున్న వరుస సమావేశాల్లో భాగంగానే ఈ భేటీ జరిగింది. దీనికి ఒకరోజు ముందు తన అధికారిక నివాసంలో 37 మంది బీజేపీ లోక్‌సభ సభ్యులతో ప్రధాని విందు సమావేశం నిర్వహించారు. పాలన, పార్లమెంటరీ వ్యవహారాలతో పాటు పలు అంశాలపై ఎంపీలతో చర్చించినట్లు తెలుస్తోంది.

ఢిల్లీలో వినిపించే రాజకీయ ప్రచారాల ప్రభావానికి లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని, ప్రతిపక్ష ఎంపీలతోనూ సత్సంబంధాలు కొనసాగించాలని మోదీ సూచించినట్లు సమాచారం.

# కాంగ్రెస్ ఉద్యమం కన్నా సీజేపీ ఉద్యమానికే ఎక్కువ స్పందన

- **శశి థరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు**
- **కాంగ్రెస్ ప్రచారం కన్నా సీజేపీ ఉద్యమానికే ఎక్కువ ఆదరణ లభించిందని వ్యాఖ్య**
- **విద్యార్థుల సమస్యలను రాహుల్ గాంధీ ముందే ప్రస్తావించారని వెల్లడి**
- **ప్రజల నాడిని పట్టుకోవడంలో కాంగ్రెస్ వెనుకబడిందని అంగీకారం**
- **2029 ఎన్నికల్లో జెన్-జీ ఓటర్లు అత్యంత కీలకం కానున్నారని వ్యాఖ్య**



కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల సమస్యలు, పరీక్షల్లో అక్రమాలపై తమ పార్టీ నేత రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్' పేరిట ప్రచారం నిర్వహించినప్పటికీ, ఆ తర్వాత వెలుగులోకి వచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఉద్యమానికే ప్రజల నుంచి, ముఖ్యంగా విద్యార్థుల నుంచి భారీ స్పందన లభించిందని ఆయన అంగీకరించారు.

ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో శశిథరూర్ మాట్లాడుతూ, "సీజేపీ చేపట్టిన అంశాలనే మా పార్టీ, రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్' ద్వారా కొన్నిరోజుల ముందే లేవనెత్తారు. కానీ ఆ ప్రచారానికి ఎందుకు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదో మేం సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజల నాడిని మేము సరిగ్గా పట్టుకోవాలి" అని వ్యాఖ్యానించారు.

రాజస్థాన్‌లోని కోటాలో జూన్ 17న రాహుల్ గాంధీ ఈ ప్రచారాన్ని ప్రారంభించగా, సీజేపీ నిరసనలు జూన్ 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మొదలయ్యాయి. సీజేపీ ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించి, అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన విషయాన్ని శశిథరూర్ ఈ సందర్భంగా పరోక్షంగా ప్రస్తావించారు.

2029 నాటికి 'జెన్‌జీ' అతిపెద్ద ఓటింగ్ వర్గంగా మారుతుందని, వారి ఆకాంక్షలను రాజకీయ పార్టీలు అర్థం చేసుకోవాలని శశిథరూర్ సూచించారు. "వీధిలో చేయాల్సిన పోరాటం వీధిలో, సభలో చేయాల్సిన పోరాటం సభలో చేయాలి" అంటూ తమ పార్టీ వ్యూహంపై తన అభిప్రాయాన్ని పునరుద్ఘాటించారు.

ఐఐఎంయూఎన్ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హాజరు కావడం, అదే వేదికపై శశిథరూర్ కూడా కనిపించడంపై వస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. భిన్నమైన అభిప్రాయాలు ఉన్న వారితో చర్చించవద్దని చెప్పడం సరికాదని, తాను కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగానే ఉంటూ తన స్వతంత్ర అభిప్రాయాలను వ్యక్తం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.



# పార్లమెంట్ సమావేశాలకు హాజరవ్వండి

- **పార్టీ ఎంపీలకు విప్ జారీ చేసిన కాంగ్రెస్**

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కీలక అంశాలు చర్చకు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఉభయ సభల్లోని తమ ఎంపీలకు విప్ జారీ చేసింది. ఆగస్టు 10, 11, 12 తేదీల్లో ఎంపీలంతా తప్పనిసరిగా సభకు హాజరు కావాలని ఆదేశించింది. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడే వరకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది.

**కీలక బిల్లులపై చర్చ**

ఈ మూడు రోజుల్లో పార్లమెంట్‌లో పలు కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఎంపీల హాజరును తప్పనిసరి చేసింది. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీల ఎంపీలు కూడా సభలో అందుబాటులో ఉండి ప్రతిపక్షానికి మద్దతివ్వాలని కోరింది.

**ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుపై ప్రతిపక్షాల వ్యతిరేకత**

విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ సవరణ బిల్లు వచ్చే వారం పార్లమెంట్‌లో చర్చకు వచ్చే అవకాశం ఉందన్న నేపథ్యంలో కాంగ్రెస్ విప్ ప్రాధాన్యం సంతరించుకుంది. స్వచ్ఛంద సంస్థలు స్వీకరించే విదేశీ నిధుల నియంత్రణ, నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన ఆస్తుల స్వాధీనం వంటి అంశాలపై ప్రతిపాదిత మార్పులను కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి.

**డీలిమిటేషన్‌పైనా చర్చకు అవకాశం**

డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుపైనా పార్లమెంట్‌లో చర్చ జరిగే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో కాంగ్రెస్ అప్రమత్తమైంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను సభలో సమర్థంగా ప్రశ్నించేందుకు ఎంపీలంతా సమన్వయంతో వ్యవహరించాలని పార్టీ సూచించింది.

ఆగస్టు 10 నుంచి 12 వరకు జరిగే సమావేశాల్లో ప్రతిపక్షం ఐక్యంగా వ్యవహరించేలా కాంగ్రెస్ వ్యూహం సిద్ధం చేస్తోంది. కీలక బిల్లుల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని పార్లమెంట్ వేదికగా గట్టిగా ప్రశ్నించాలని పార్టీ నిర్ణయించింది.






# చేనేత భారత సంస్కృతికి అద్దం

- **సంప్రదాయ కళకు ఆధునిక మార్కెట్ అనుసంధానం అవసరం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:**

12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో ఘనంగా జరిగాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొని సంత్ కబీర్ చేనేత పురస్కారాలు, జాతీయ చేనేత పురస్కారాలు-2025 విజేతలకు అవార్డులు అందజేశారు. భారత నాగరికత పరిణామ క్రమంలో చేనేతకు శతాబ్దాల చరిత్ర ఉందని, దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాంతీయ ప్రత్యేకతలను ప్రతిబింబించే గొప్ప వారసత్వంగా ఈ రంగం నిలిచిందని రాష్ట్రపతి పేర్కొన్నారు.

**వైవిధ్యాన్ని ప్రపంచానికి పరిచయం**

దేశంలోని వివిధ ప్రాంతాల కళాత్మక నైపుణ్యాన్ని చేనేత ఉత్పత్తులు ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయని ద్రౌపది ముర్ము అన్నారు. ఒక్కో ప్రాంతానికి ప్రత్యేకమైన నేసిన వస్త్రాలు భారతదేశంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయ చేనేత కళలను పరిరక్షిస్తూ వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు.

**ఆధునిక రూపకల్పనలతో అనుసంధానం**

సంప్రదాయ చేనేత కళలకు ఆధునిక రూపకల్పనలను జోడించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి సూచించారు. సమర్థవంతమైన బ్రాండింగ్, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం ద్వారా చేనేత ఉత్పత్తులకు మరింత విస్తృత అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. యువ పారిశ్రామికవేత్తలు, రూపకర్తలు, నవ్య ఆలోచనలతో పనిచేసే సంస్థలు ఈ రంగంలోకి వస్తే కొత్త అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు.

**కళాకారుల కృషి ప్రశంసనీయం**

చేనేత రంగం లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తోందని ద్రౌపది ముర్ము తెలిపారు. చేనేత కళాకారులు కొనసాగిస్తున్న సంప్రదాయ నైపుణ్యం దేశానికి గర్వకారణమని కొనియాడారు. వారి కృషిని గుర్తించి జాతీయ స్థాయి పురస్కారాలతో గౌరవించడం సంతోషకరమని పేర్కొన్నారు. సంప్రదాయ నైపుణ్యాన్ని ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దితే భారత చేనేతకు ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు లభిస్తుందని రాష్ట్రపతి అన్నారు.



## ఇథనాల్ ఫ్యాక్టరీలు మూసివేయాలి



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

బెజ్జంకి మండల కేంద్రంలో శుక్రవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించి, మండలంలోని ఇథనాల్ ఫ్యాక్టరీలను వెంటనే మూసివేయాలని ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, పర్యావరణం, వ్యవసాయ భూములను పరిరక్షించడమే లక్ష్యంగా 'మా భూమి—మా ఆరోగ్యం—మా ఊరు' అనే నినాదంతో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించడం, బెజ్జంకి మండల బంద్ నిర్వహించడం వంటి ప్రజాస్వామ్యబద్ధమైన కార్యక్రమాలు చేపట్టినా అధికారుల నుం చి ఎలాంటి స్పందన రాకపోవడం విచారకరమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయడం తగదని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం, భూగర్భ జలాలు, పర్యావరణ పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 11న మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించాలని సమావేశంలో నిర్ణయించారు. అవసరమైతే శాంతియుత నిరసన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని నాయకులు తెలిపారు. జిల్లా కలెక్టర్ దృష్టికి మరోసారి ఇథనాల్ ఫ్యాక్టరీల సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు, సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్, సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ లింగాల లక్ష్మణ్, బీజేపీ నాయకులు కరివేద మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఏల శేఖర్ బాబు, సీపీఎం నాయకులు బొమ్మిడి సాయికృష్ణ, బోనగిరి లింగయ్య, లింగాల వెంకటేష్, సాయి, కనగండ్ల శంకర్, న్యాయవాది లింగాల సురేష్, ధర్మ సమాజ్ పార్టీ మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత వస్త్రాలు ధరించి నేతన్నలను ప్రోత్సహిద్దాం

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



మన సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ప్రోత్సహించాలని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. చేనేత కార్మికులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు చేనేత వస్త్రాలు ధరించేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పచ్చునూరు చేనేత క్లస్టర్ రూపొందించిన చీరను ఆవిష్కరించారు. ఆడిటోరియం వద్ద టెస్కో కరీంనగర్ డివిజన్ ఆధ్వర్యంలో చేనేత వస్త్రాలతో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. అనంతరం చేనేత ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు గీతా భావం చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవ రావు, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, మాజీ మేయర్ రవీందర్ సింగ్, కార్పొరేటర్ వాసాల రమేష్, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు




## స్వాతంత్ర్య వేడుకలకు శ్రీకారం



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శంకరపట్నం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు క్రీడా, సాహిత్య, సాంస్కృతిక పోటీలను ఘనంగా ప్రారంభించారు. ప్రిన్సిపాల్ కే. ప్రభాకర్ పోటీలను ప్రారంభించి, క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. క్రీడా స్ఫూర్తి, దేశభక్తిని చాటిచెప్పే నినాదాలతో విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఉత్సాహభరితంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనీ వాసుదేవ్ ఆధ్వర్యంలో విద్యార్థులను వివిధ జట్లుగా విభజించి కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ తదితర క్రీడా పోటీలను నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీష్ విభాగాల ఉపాధ్యాయులు డా. మహేందర్, రాధా, సంధ్య, శంకర్, అనిత, రమణారెడ్డి ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వం, పద్య పఠనం, వచన కవితా రచన తదితర సాహిత్య, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. పోటీలను 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు జూనియర్ విభాగంగా, 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు సీనియర్ విభాగంగా నిర్వహించారు. విద్యార్థులు అన్ని పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, సతీష్, శివశంకర్, నాగమణి, ఆర్. రజిత, ఎస్. రజిత, వనజ, స్వప్న, మధుకర్, రజిని, అనిత తదితరులు పాల్గొని పోటీల నిర్వహణలో సహకరించారు. ఈ క్రీడా, సాహిత్య, సాంస్కృతిక పోటీలు విద్యార్థుల్లో దేశభక్తి, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, పోటీతత్వ స్ఫూర్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

## భూ రీ-సర్వేపై అవగాహన సదస్సు




**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

భూముల రీ-సర్వే ప్రక్రియ, రైతులకు భూ హక్కులపై అవగాహన కల్పించేందుకు బెజ్జంకి మండలం వీరాపూర్ గ్రామంలో సర్పంచ్ చిలుముల సతీష్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ పాల్గొని పలు సూచనలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో 'భూభారతి' కార్యక్రమం కింద గ్రామాల్లో భూ సర్వే అవగాహన సదస్సులు నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. డిజిటల్ మ్యాపుల రూపకల్పన, భూముల సరిహద్దుల నిర్ధారణ, భూధార్ నంబర్ల కేటాయింపు, రీ-సర్వే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. భూ రికార్డుల విషయంలో రైతులు తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన సవరణలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్, ఆర్ఐ సుహాసిని, జీపీఓ రజిత, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెన్షన్ నిబంధనలపై బీజేపీ రాస్తారోకో



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కొత్త నిబంధనల పేరుతో నిరుపేదలకు సామాజిక భద్రతా పెన్షన్లు దూరం చేయొద్దని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు శుక్రవారం శంకరపట్నం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించాయి. బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో అధికారులు ఇటీవల జారీ చేసిన నిబంధనల ఉత్తర్వుల ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 57 సంవత్సరాలు నిండిన ప్రతి వృద్ధుడికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని, 40 శాతం పైబడిన దివ్యాంగులందరికీ పెన్షన్ అందించాలని, వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి వితంతు మహిళకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త నిబంధనలతో అర్హులైన వారికి పెన్షన్లు నిరాకరిస్తే తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎలాంటి అదనపు నిబంధనలు లేకుండా అర్హులైన దరఖాస్తుదారులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీడీవో అనితకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్య, నాయకులు దొంగల రాములు, జంగ జైపాల్, కొయ్యడ అశోక్, దాసారపు నరేందర్, నిమ్మశెట్టి సంపత్, రాసమల్ల శ్రీనివాస్, కనకం సాగర్, ఎల్కపెల్లి సంపత్, మందాడి జగ్గారెడ్డి, కనకం కుమార్, పడాల వెంకటలక్ష్మి, గూళ్ల రాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గట్టు తిరుపతి గౌడ్ జన్మదిన వేడుకలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, కాచాపూర్ మాజీ సర్పంచ్ గట్టు తిరుపతి గౌడ్ జన్మదిన వేడుకలను శుక్రవారం కేశవపట్నంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేశవపట్నంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండారు తిరుపతి, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్లు గోపగోని బసవయ్య, కీసర సంపత్, గాజుల మహేష్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## దోమల నివారణకు ఫ్రైడే డ్రై డే

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి శుక్రవారం 'ఫ్రైడే—డ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చీలాపూర్‌పల్లి సర్పంచ్ ఎర్రవెల్లి శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలో ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, నీటి నిల్వ ప్రాంతాల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు శంకరయ్య, అంగన్వాడీ టీచర్ సుజాత, ఆశ కార్యకర్త పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## అక్షర బటర్ ఫ్లై'లో అలరించిన బోనాల వేడుకలు





**శెనార్తిమీడియా, గంగాధర :**

గంగాధర మండలం బూరుగుపల్లి అక్షర బటర్ ఫ్లై స్కూల్లో శుక్రవారం బోనాల వేడుకలు నిర్వహించారు. పిల్లలు భక్తి శ్రద్ధలతో అలంకరించిన బోనాలతో రాగా అబ్బాయిలు పోతరాజు, పులి వేషాలతో డ్యాన్సులు చేస్తూ ఆకట్టుకున్నారు. బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేస్తూ పోచమ్మకు మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మినుకుల మునీందర్, డైరెక్టర్ రాధ, టీచర్స్ పాల్గొన్నారు.



## హర్ ఘర్ తిరంగా సన్నాహక సమావేశం

**శెనార్తి మీడియా, బెజ్జంకి:** భారతీయ జనతా పార్టీ బెజ్జంకి మండల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండల సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు కొలిపాక రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తిరంగా యాత్ర, జాతీయ జెండాల పంపిణీ, ఆగస్టు 10 నుంచి 14 వరకు చేపట్టనున్న కార్యక్రమాల ప్రణాళికపై చర్చించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల ఇన్‌చార్జి ముత్యాల జగన్ రెడ్డి మాట్లాడుతూ దేశభక్తిని ప్రతి ఇంటికీ చేర్చే గొప్ప కార్యక్రమమే హర్ ఘర్ తిరంగా అని అన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. యువత, మహిళలు, రైతులు, అన్ని వర్గాల ప్రజలను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 10 నుంచి 14 వరకు నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని క్రమశిక్షణతో విజయవంతం చేసి భారతమాత గౌరవాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ బుర్ర మల్లేశం గౌడ్, గుగ్గిళ్ల సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్య, మండల నాయకులు దొమ్మట రాములు, బోయినిపల్లి అనిల్ రావు, గైని రాజు, సంగ రవి, కల్లెపల్లి ఉపసర్పంచ్ బుర్ర వీనిత్, కొత్తపేట రామచంద్రం, వడ్లూరి సాయిలు, నూనె అంజన్న, దొడ్ల ప్రశాంత్, జగన్, వడ్లూరి శ్రీనివాస్, జెల్ల అనిల్, బుర్ర కిషన్, లోనే నర్సింగం, పులి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వంకాయగూడెంలో గొర్రెల చోరీ..

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు గొర్రెలను చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుర్రం లింగమూర్తి గత ఐదేళ్లుగా ఇంటి ముందు గొర్రెలు, మేకలను పెంచుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూడు గొర్రె పోతులు, ఒక గొర్రెను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. చోరీకి గురైన గొర్రెల విలువ సుమారు రూ.35 వేల వరకు ఉంటుందని, వాటి ద్వారానే తన కుటుంబ జీవనం సాగుతోందని లింగమూర్తి ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి చోరీకి పాల్పడిన వారిని గుర్తించి న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

## చేనేత కార్మికులకు ఘన సన్మానం



**శెనార్తి మీడియా, బెజ్జంకి:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బెజ్జంకి మండల కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ బెజ్జంకి టౌన్ అధ్యక్షుడు కత్తి రమేష్ ఆధ్వర్యంలో చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ చేనేత కార్మికులకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో మహాత్మా గాంధీ రాట్నంపై నూలు వడుకుతూ స్వాతంత్ర్య సాధనలో చేనేతకు ఎంతో ప్రాధాన్యత కల్పించారని లింగాల శ్రీనివాస్ తెలిపారు. చేనేతలోని ప్రతి నూలుపోగులో కార్మికుల కృషి దాగి ఉంటుందని, చేనేత వస్త్రాల్లో భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, వార్డు సభ్యులు బోనగం రమేష్, పుర్మ నారాయణ రెడ్డి, బోనగిరి శ్రీనివాస్, ఇప్కిల్ల పర్ష రాములు, సంగ రమేష్, అమరాజు ప్రశాంత్, బోనగిరి చంద్రం, బక్కోల్ల రాజలింగం తదితరులు పాల్గొన్నారు.



# మహిళలకు స్ఫూర్తి ప్రదాత సూర్యదేవర రాజ్యలక్ష్మి

## నేడు సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి వర్ధంతి

శతాబ్దాల శ్వేత జాతీయుల పాలనలో అష్టకష్టాలు అనుభవించి, ఆంగ్లేయుల దాస్య శృంఖలాలను తెంచు కునేందుకు ఎందరో పోరాట పటిమను, తెగువను చూపించారు. భారత స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించారు. తమ సర్వస్వం స్వాతంత్ర సాధనకోసం త్యాగం చేసిన వారు ఎందరో ఉండగా, మగ వారితో సమానంగా కొంత మంది మహిళలు కూడా తెగించి స్వేచ్ఛా భారతం కోసం పోరాటం సల్పిన ఘన చరిత్ర ఉంది. సాంప్రదాయాలకు, కట్టుబాట్లకు అధిక ప్రాముఖ్యత ఇచ్చే రోజుల్లో మహిళలు స్వతంత్ర పోరాటంలో పాల్గొని భారతదేశ పౌరుషాన్ని చాటిన సందర్భాలు మరచి పోలేనివి. తాము అబలలము కామని, త్యాగాలకు వెరవమని నిరూపించి, తెగించి బ్రిటీషర్లతో పోరాడారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాము లయ్యారు. అలాంటి వారిలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు, సంఘ సేవకు రాలు సూర్యదేవర రాజ్యలక్ష్మీ దేవి ముఖ్యులు.

సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి (మే 18, 1914 – ఆగష్టు 8, 2010) కృష్ణాజిల్లా నందిగామ తాలూకా వీరుల పాడులో మే 18, 1914లో వాసిరెడ్డి సీతా రామయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. ఆమె గురువు అతను కవి, పండితుడు జంగా హనుమ య్యా చౌదరి ఉత్తమ విషయ పరిజ్ఞానాన్ని బోధించి, విద్వత్తు కలిగించారు. సూర్య దేవర నాగయ్యతో రాజ్యలక్ష్మీ దేవికి పదేళ్ళ వయస్సులో వివాహ మై, ఆమెక 16 ఏళ్ళకు అత్తవారింటికి వచ్చేవరకు విద్యా వ్యాసంగాలు కొన సాగించారు. వీరులపాడులో గ్రంథాలయాన్ని వినియోగించు కుని, తాపీధర్మారావు, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, త్రిపురనేని రామ స్వామి చౌదరి వంటి సంఘ సేవకులు రచించిన గ్రంథాలను రాజ్యలక్ష్మీదేవి ప్రతి రోజూ తెచ్చుకుని చదివి అవగాహన చేసుకునేవారు. ఇవన్నీ ఆమెలో స్వతంత్ర్య భావాలను, స్వేచ్ఛాభిలాషను పెంచాయి. 1920లో గాంధీజీ ఇచ్చిన పిలుపు విని దేశసేవకు నడుం బిగించారు. 1930లో ఉప్పు సత్యా గ్రహంలో పాల్గొనాలని అనుకున్నా, ఆమె జైలుశిక్ష అనుభవించటానికి, సత్యా గ్రహం చేయటానికి భర్త, ఇంట్లో పెద్దలు అంగీకరించలేదు. రాట్నంపై నూలు వడకటం, హిందీ నేర్చుకోవటం, ఖాదీ ధారణ అక్కడ పరిపాటి. ఉద్యమం ప్రచారం చేస్తూ రాజ్యలక్ష్మీదేవి దగ్గర బంధువటైన అన్నపూర్ణమ్మతో శాసనోల్లంఘన చేయతల పెట్టారు. జాతీయ గీతాన్ని ఆలపిస్తూ శాసనధిక్కార నినాదాలు ఊరేగింపుగా వెళ్లగా పోలీసులు అరెస్టు చేశారు.

శిక్ష గురించి న్యాయమూర్తుల ఇళ్ళలో సైతం స్త్రీలు వీరికి అండగా నిలవడంతో ఆ శిక్ష రద్దు చేసి నామమాత్రపు శిక్షను విధించగా, రాజ్యలక్ష్మీదేవిని రాయవేలూరు జైలుకు తరలించారు. రాజ్యలక్ష్మి ఖాదీ ప్రచారం, మహిళా ఉద్యమం, రాజకీయ కార్యకలాపాలు కొనసాగిస్తూ, కష్టపడి చదివి రాష్ట్రభాష పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. అస్పృశ్యతా నివారణ కోసం ఆమె తన వంతు కృషి చేశారు. హరిజన స్త్రీలను అందరితో పాటు గౌరవించేవారు. 1940లో వ్యక్తి సత్యాగ్రహం ఆరంభమైంది. గుంటూరు జిల్లాలో ఆ సత్యా గ్రహం చేయడానికి అనుమతి లభించిన తొలిస్త్రీ రాజ్యలక్ష్మి. 1941 జనవరి 30లో బాపట్ల తాలూకాలోని బ్రాహ్మణ కోడూరులో ఆమె సత్యాగ్రహం చేశారు. పోలీసులు అరెస్ట్ చేసి, రెండు నెలల జైలు శిక్ష, వందరూపాయల జరిమానా విధించారు.

ఆమె జైల నుండి విడుదలటై మద్రాసులోని ఆంధ్ర మహిళా సభకు చేరుకున్నారు. తరువాత తెనాలి వెళ్ళి ట్యుటోరియల్ కాలేజిలో చేరి బెనారస్ మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఆమె చేబ్రోలు కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉండి మహిళా భ్యున్నతికి దేశాభ్యు దయానికి పాటు పడ్డారు. క్విట్ ఇండియా ఉద్యమంలో రాజ్యలక్ష్మీదేవిని శాసనధిక్కార శాఖ సభ్యురాలిగా నియమించారు. ఆమె రహస్యంగా జిల్లాలన్నీ తిరిగి ప్రజలచే శాసన ధిక్కారం చేయించారు. పోలీసుల నుండి ఆమెను దేశభక్తులు కాపాడే వారు. రాజ్యలక్ష్మీదేవి 1941లో చేబ్రోలులో జాతీయ మహిళా విద్యాలయాన్ని స్థాపించారు. ఆ తరువాత అక్టోబరు 1945లో ఆంధ్ర రాష్ట్ర మహిళా రాజకీయ పాఠశాలను ప్రారంభించారు.

భారత దేశానికి 1947 ఆగష్టు 15వ తేదీన స్వాతంత్ర్యం సిద్ధించినా, నైజాము ఏలు బడిలో ఉన్న వారికి విముక్తి కలగలేదు. రాజ్యలక్ష్మీదేవి విరాళాలు, చందాలు పోగుచేసి నైజాం వ్యతిరేక పోరాట నాయకు లకు తమ సంఘీభావాన్ని తెలిపారు. రాజ్యలకీదేవి వ్యక్తి గతంగా నైజాం వెళ్ళి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాదు సంస్థానం స్వతంత్ర భారత దేశంలో విలీనమయ్యే వరకు ఆమె అక్కడి వారితో కలసి పోరాటం సాగించారు. 1950లలో తెలుగు దేశం అనే పత్రిక నడిపారు. మహిళాభ్యుదయ సంస్థలో మల్లాది సుబ్బమ్మ తదితరు లతో కలిసి మద్యపానానికి వ్యతిరేకముగా పోరాటం చేశారు. రాజ్యలక్ష్మి ఆగష్టు 8, 2010 న మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలంగాణ బతుకును అక్షరాల్లో నిలిపిన యశోద

## నేడు పాకాల యశోదారెడ్డి జయంతి

ఆమె తెలంగాణ గర్వించ దగిన సాహితీ మూర్తి. తెలంగాణ సజీవ భాషను తన రచనల్లో వాడి పలువురి మన్ననలు పొందిన సాహితీవేత్త. ఆకాశవాణిలో తెలంగాణ మాండలికంలో ప్రసంగం చేసిన తొలి రచయితగా పేరు గడించారు. తెలుగు ప్రాచీన సాహిత్యంపై ఆమె చేసిన ప్రసంగాలు బహు పండిత ప్రశంసా పాత్రాలు అయినాయి. ఆమె పలు రచనలు మన్ననలకు నోచుకున్నాయి. ఆమే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలుగా పని చేసి గుర్తింపు పొందిన పాకాల యశోదారెడ్డి.

“పాకాల యశోదారెడ్డి సంస్కృతాంధ్ర భాషల్లో విదుషీ మణి, పరిశోధకురాలు, సాహిత్య విమర్శకురాలు. వచన కవిత్వం కూడా వ్రాసారు. . ఆమె వేదికలమీద అనర్గళంగా ఉపన్యసించి మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. ఆమె వాగ్ధాటికి శ్రోతలు తన్మయులయ్యే వారు. అచ్చమైన తెలుగు, సుదీర్ఘమైన సంస్కృత సమాసాలతో కూడిన ప్రసంగాలు విన ఇంపుగా ఉండేది. ఆమె దివాకర్ల వేంకటవధాని శిష్యురాలు. 1950 దశకారంభం నుంచే ఆమె ఆలిండియా రేడియోలో “మహాలక్ష్మి ముచ్చట్లు” అని వినిపించేది.

యశోదా రెడ్డి (ఆగష్టు 8, 1929 – అక్టోబర్ 7, 2007) ప్రముఖ రచయిత్రి. ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేసి, పదవీ విరమణ గావించారు. పలు సాహిత్య విమర్శనా గ్రంథాలు రాశారు. కథా సంపుటాలను వెలువరించారు. పాకాల

యశోదారెడ్డి 1929, ఆగష్టు 8 న పాలమూరు జిల్లా ( నాగర్‌కర్నూల్ జిల్లా), బిజినేపల్లిలో సరస్వతమ్మ, కాశిరెడ్డి దంపతులకు ఆమె జన్మించారు. యశోదారెడ్డి మూడవ తరగతి వరకు మహబూబ్ నగర్ లో, ఉన్నత పాఠశాల విద్యను హైదరాబాద్, నారాయణగూడ లోని బాలికల ఉన్నత పాఠశాలలోను పూర్తి చేశారు. రాజబహద్దూర్ వెంకట్రామిరెడ్డి ప్రోత్సాహంతో కళాశాల విద్య కొసాగించి, ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి తెలుగు, సంస్కృత భాషలలో స్నాతకోత్తర విద్య పూర్తి చేశారు. జర్మన్ భాషలో, భాష శాస్త్రంలో డిప్లొమా చేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం లోనే తెలుగులో హరివంశాలు” అను అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. 1976లో అలీఘర్ విశ్వ విద్యాలయం నుండి డి.లిట్ అందుకున్నారు. యశోదారెడ్డికి హిందీ, ఉర్దూ, కన్నడ భాషల్లో ప్రావీణ్యంతో పాటు, జర్మన్ భాష తో కూడా పరిచయం ఉండేది. ఆమె భర్త ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పి. టి. రెడ్డి గా సుపరిచితులైన పాకాల తిరుమల్ రెడ్డి. జె.జె.ఆర్ట్ కళాశాలలో చదువుకుని, కొన్నాళ్ళు లాహోర్లో పనిచేసి హైదరాబాదు తిరిగి వచ్చిన



తిరుమలరెడ్డి, ఆమె వక్తృత్వ ప్రతిభను చూసి, పి.టి.రెడ్డి ఆకర్షితుడై 1947లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తిరుమల్ రెడ్డి గీసిన అనేక చిత్రాలకు ఆమే స్ఫూర్తి. యశోదారెడ్డి కూడా స్వతహాగా కళాపిపాసి. ఆమె రకరకాల ఇత్తడి విగ్రహాలను హాబీగా సేకరించే వారు. పి.టి రెడ్డి సాంగత్యంతో వాటిలోని కళానైపుణ్యాన్ని, వైటభవాన్ని ఆమె గుర్తించ గలిగేవారు. భర్త చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసినపుడు ఒక కార్యకర్తగా పని చేసి అది విజయవంతం అయ్యేందుకు దోహదపడేది.

1955లో హైదరాబాద్, కోఠి మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగ జీవితం ప్రాంభించారు. తరువాత రీడర్‌గా, ప్రొఫెసర్‌గా ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పనిచేసి, ఎందరో పరిశోధకులకు మార్గదర్శియై, 1989లో పదవీ విరమణ పొందారు. ఆమె ధర్మశాల, ఎచ్చమ్మ కథలు తదితర కథా సంపుటాలను వెలువరించారు. యశోదా రెడ్డి వందకు పైగా కథలు వ్రాసినా వాటిలో 63 మాత్రమే పుస్తక రూపంలో రావడం జరిగింది. ఆమె ప్రచురించిన మూడు కథా సంపుటాల్లో, మావూరి ముచ్చట్లు (1973) కథా సంపుటి 1920–40 నాటి తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని చిత్రీకరిస్తే, ఎచ్చమ్మ కథలు (1999) 1950–70 నాటి తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు, ధర్మశాల (2000) కథా సంపుటి 1980–1990 నాటికి తెలంగాణ సమాజంలో వచ్చిన మార్పులకు దర్పణం పట్టింది. ఈ మూడు కథా సంపుటాల్లో ఈమె తెలంగాణ భాషను, యాసను, సంస్కృతిని, సామాజిక జీవితాన్నిఅక్షర బద్ధం చేశారు. మావూరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు, పాలమూరు జిల్లా మాండలికంలో వ్రాస్తే, ధర్మశాల కథా సంపుటిని మాత్రం వ్యవహారిక తెలుగు భాషలో లిఖించారు. యశోదారెడ్డి కథలు తెలంగాణ జనజీవన సంస్కృతిను, తెలంగాణా మాండలిక నుడికారానికి అద్దం పడతాయి. ఎచ్చమ కథలకు ముందుమాటలో “ఒక జాతి సంస్కృతిలో ఆ జాతి జీవన విధానం ప్రతిఫలిస్తుంది. ఈ సంస్కృతీ సర్వస్వం ఆ జాతి భాషలో నిక్షిప్తమై జీవిస్తుంది. ఆ భాష ఆ జాతికి ప్రత్యేకమైన ఆచార వ్యవహార, ఆర్థిక, రాజకీయ, సామాజిక మూలధాతువులను జీర్ణించుకొని రససిద్ధిని పొంది జాతీయాల్లో, పలుకుబళ్లలో, సామెతల్లో పొందుపడి ప్రభుత్వాన్ని నెరుపుతుంది. ఒక భాషలో ఒక నానుడి కానీ, సామెత కానీ, జాతీయం కానీ అలవోకగా పుట్టదు. ఆయా జాతీయులు, తలలు పండినవారి అనుభవాన్ని వీడబోసి నిగ్గుదేల్చిన సారమే ఈ నుడికారపు ఇంపుసొంపులు. అందుకే అవి భాషకు జీవనాడి. ప్రాణ ధాతువుల వంటివి అని అభిప్రాయడిన యశోదారెడ్డి...తన కథల నిండా తెలంగాణ నుడికారపు సొంపులకు పెద్దపీట వేశారు. యశోదారెడ్డి కథారచయిత్రిగానే కాకుండా కవయిత్రిగా కూడా ప్రసిద్ధులే. ఆమె రాసిన కవితలు అనేక పత్రికలలో ముద్రించ బడ్డాయి. స్వయంగా తానే తన కవితలను ‘ ఉగాదికి ఉయ్యాల , భావిక అనే రెండు సంపుటాలగా వెలువ రించారు. మలేషియాలో జరిగిన తెలుగు సమ్మేళనంలో కవయిత్రిగా పాల్గొని, ప్రశంసలందు కున్నారు. పారిజాతా పహరణం, ఉత్తర హరివంశం, తెలుగు సామెతలు, ఆంధ్ర క్రియా స్వరూపమణి దీపిక మొదలగు పుస్తకాలకు సంపాదకత్వం వహించి, విలువైన పీఠికలను రాసి, వెలువరించారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, లలిత కళా అకాడమీ, సంగీత అకాడమీలలో సభ్యురాలిగా పని చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్, జానపద కళా సాహిత్య సంస్థలతో ఆమెకు అనుబంధం ఉండేది. యశోదారెడ్డి 2007, అక్టోబర్ 7 న హైదరాబాదులో మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పద్యానికి పట్టాభిషేకం చేసిన చెళ్లపిళ్ల

## నేడు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి జయంతి

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయులైన మహాకవి. పద్య రచన, ప్రబంధ కావ్యాలు, నాటక సాహిత్యం, అవధాన విద్య తదితర ప్రక్రియల్లో తనదైన ముద్రవేసిన గొప్ప ప్రతిభాశాలి. 1870 ఆగస్టు 8న కృష్ణా జిల్లా కౌతవరం గ్రామంలో జన్మించిన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి బాల్యంలో నుంచే పద్య సాహిత్యంపై మక్కువతో తెలుగుతో పాటు సంస్కృత భాషలోనూ విశేష పాండిత్యం సంపాదించాడు. ఈ పాండిత్యమే ఆయన సాహిత్య కృషికి గట్టి పునాది వేసింది. తెలుగు భాషలోని ఛందోబద్ధతకు, శబ్ద సౌష్ఠవానికి, భావ పరిపక్వతకు ప్రతీకగా ఆయన రచనలు నిలిచాయి.

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి జీవితంలో కీలక ఘట్టం దివాకర్ల తిరుపతి శాస్త్రితో ఏర్పడిన సాహిత్య బంధం. వీరిద్దరూ కలసి తిరుపతి వేంకట కవులు అనే పేరుతో ప్రసిద్ధి పొందారు. జంట కవులుగా వీరిద్దరి అవధానాలు, పద్య ధారణలు, సభాభినయాలు అప్పటి సమాజంలో విశేష ఆదరణ పొందాయి. రాజ దర్శనాల వేదికలపై, ప్రజా సభలవద్ద వీరు నిర్వహించిన అవధానాలు సాహితీ మేధస్సుకు అద్దంపట్టేలా ఉండేవి. ప్రశ్నలకు శీఘ్ర ప్రతిస్పందన, ఛందోబద్ధమైన పద్య సమాధానాలు, చమత్కారంతో కూడిన పద చిత్రణలు వీరి ప్రతిభకు నిదర్శనాలుగా నిలిచాయి. జనుల మధ్య సాహిత్యాన్ని సులభంగా అందించే విధానం వీరిద్దరి రచనలలో కనిపిస్తుంది.

తిరుపతి వేంకట కవుల రచనలు సాంప్రదాయాన్ని కాపాడుతూ, నవీన భావజాలానికి తలుపులు తెరిచినవిగా నిలిచాయి. ముఖ్యంగా పాండవ జననము, పాండవ ప్రవాసము, పాండవ రాజసూయము, పాండవోద్యోగము, పాండవ విజయము, పాండవ అశ్వమేధము అనే నాటకాలుగా రచించారు. నాటకాలు మహాభారత ఇతివృత్తాలను ఆధారంగా తీసుకుని రచించబడ్డవి. వీటిలో పాత్రల వ్యక్తిత్వం, మానవీయత, నైతిక విలువలు నాటకీయంగా అభివ్యక్తమయ్యాయి. బుద్ధ చరిత్ర అనే కావ్యంలో గౌతమ బుద్ధుని జీవితం, తాత్త్వికత, సందేశాత్మకత అద్భుతంగా ప్రతిబింబించ బడింది. శ్రవణానందం అనే ప్రబంధంలో శ్రవణ కుమారుని పితృభక్తిని, త్యాగాన్ని పరిచయం చేశారు. నానారాజ సందర్శనం అనే గ్రంథంలో తాము జీవితంలో కలిసిన అనేక రాజులు, పండితులతో జరిగిన పరిచయాలను, అనుభవాలను చమత్కార భరితంగా వర్ణించారు. కథలు గాథలు(వేంకటశాస్త్రి వచన రచనల సంకలనం) “ఒక అర్థశతాబ్దిలో తెలుగు



సాంస్కృతిక చరిత్ర” అంటూ పుస్తకం వెనుక అట్టపై ప్రచురణకర్తలు ప్రశంసించారు. ఈ రచనలన్నీ పద్యం, గంభీరత, సరళత, శైలి, శబ్ద సౌష్టవం వంటి లక్షణాల్లో అత్యుత్తమంగా నిలిచాయి.

అవధాన కళను కేవలం మేధో ప్రదర్శనంగా కాకుండా సాహిత్య వినోదంగా తీర్చిదిద్దిన ఘనత చెళ్లపిళ్ల వేంకటశాస్త్రికే చెందుతుంది. పద్యధారణలో అతిశయోత్సాహం, పదచాతుర్యం, వ్యాకరణ పరిపూర్ణత, భావ వైవిధ్యం కలగలిపిన ఆయన శైలి తెలుగు పద్యసాహిత్యంలో విలక్షణంగా నిలిచి ఉంటుంది. ప్రజల మధ్య సాహిత్యాన్ని గాంభీర్యంతో పాటు వినోదాత్మకంగా పరిచయం చేసిన మేధావిగా ఆయన పేరు నిలిచిపోయింది. సభికులను ఆశ్చర్యానికి గురిచేసేలా పద్య సమాధానాలు చెప్పే సామర్థ్యం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. శతావధానాలు, దశావధానాలు నిర్వహిస్తూ మేధో ప్రతిభను సాహిత్యానికీ వినోదానికీ అనుసంధానించిన వారు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి.

ఆయన పద్యాల్లో సంస్కృత నుపురనాదం వినిపించినా, ప్రజల భాషగా తెలుగు మాధుర్యాన్ని మరచిపోలేదు. ఛందస్సులో నియమనిష్ఠ, శబ్దచిత్రాల ద్వారా భావ వ్యాప్తి, సామాన్య పాఠకులకు సైతం అర్థమయ్యే సరళ శైలి ఆయన రచనల్లో కనిపిస్తాయి. హాస్యము, వ్యంగ్యము, భక్తి, నీతి, చమత్కారంతో కలిపిన పద్యాలు ఆయన ప్రత్యేకత. ఆయన రచనలు కేవలం పాఠ్యపుస్తకాల వరకే పరిమితం కాక, వేదికల మీద వినిపించే పద్యాల్లోనూ ప్రబలంగా వినిపించాయి. ఆయన కవిత్వం ప్రజా సాహిత్యానికి, పాండిత్య సాహిత్యానికి మధ్య ఉన్న అంతరాన్ని కలుపుతుందనడం అతిశయోక్తికాదు.

చెళ్లపిళ్ల సమకాలికులైన వేదం వేంకటరాయశాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనరసింహం, కందుకూరి వీరేశలింగం లాంటి సాహిత్య ప్రముఖుల మాదిరిగా ఆయన రచనల్లోనూ ఆధునికత, సామాజిక స్పృహ, జీవన విధానాలు ప్రతిఫలించాయి. అయితే ఆయన పద్యరచన శైలిలో సాంప్రదాయ భావాలనూ, నూతన రచనా తత్వాన్నీ సమపాళ్లలో మేళవించగల సమర్థత ఉంది. అలాంటి శైలికి ఉదాహరణగా బుద్ధ చరిత్ర, శ్రవణానందం వంటి రచనలు నిలిచాయి. పాండిత్యంతో పాటు ప్రజల అభిరుచిని దృష్టిలో పెట్టుకుని, సాహిత్యాన్ని అందరికీ నచ్చేలా మార్చిన శిల్పి ఆయన.

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి బందరు పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేయగా, వేంకటశాస్త్రి వద్ద విద్యను అభ్యసించి, సాహిత్య రంగంలో, భాషాశాస్త్రంలో కవులుగా, రచయితలుగా, పండితులుగా లబ్ధప్రతిష్ఠులైన వారిలో విశ్వనాథ సత్యనారాయణ, వేటూరి ప్రభాకరశాస్త్రి, పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు, వేలూరి శివరామశాస్త్రి, శ్రీరాముల సచ్చిదానందం, అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి వంటి మహామహులు ఉన్నారు.

1950 జూన్ 16న చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి పరమపదించారు. కానీ ఆయన సాహిత్య రచనలు, పద్య శైలి, అవధాన కళా వైభవం తెలుగు సాహిత్యంలో శాశ్వత స్థానాన్ని పొందాయి. నేటికీ ఆయన రచనలు పాఠశాలలు, కళాశాలల పాఠ్య గ్రంథాల్లో ఉన్నాయి. అవి అధ్యయనానికి, పరిశోధనలకు ప్రేరణగా నిలుస్తున్నాయి. సమగ్రంగా చూస్తే, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కవిత్వంలో మాధుర్యం, మేధోప్రభ, భక్తి, హాస్యం, శైలీ నైపుణ్యం కలగలిపి ఉంటాయి. తెలుగు భాషా సాహిత్యాన్ని ప్రజల్లో విస్తృతంగా వ్యాపింప జేసిన మహనీయుడు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి. ఆయన పేరు తెలుగు పద్య సాహిత్యంలో అమరంగా నిలుస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# లంక బ్యాటర్ల దంచికొట్టుడు




- ప్రాక్టీస్ మ్యాచ్‌లో టీమిండియా బౌలర్లకు చుక్కలు
- తొలి రోజే 363 పరుగులతో ఆతిథ్య జట్టు పట్టు
- ముగ్గురి అర్ధశతకాలు.. తొలి వికెట్‌కు 110 పరుగులు
- స్పిన్నర్లకు తలో రెండు వికెట్లు.. సుథార్ పొదుపైన బౌలింగ్
- గాయం కారణంగా బరిలోకి దిగని కెప్టెన్ గిల్

**కొలంబో, ఆగస్టు 7:** టెస్టు సిరీస్‌కు ముందు టీమిండియాకు శ్రీలంక ఎలెవన్ బ్యాటర్లు గట్టి హెచ్చరికలే పంపారు. మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో తొలి రోజే భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక ఎలెవన్ ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసింది. ఓపెనర్లు రవిందు రసంత, నిషాన్ మదుష్కతో పాటు కెప్టెన్ సోనాల్ అర్ధశతకాలతో చెలరేగడంతో భారత బౌలర్లు పరుగుల ప్రవాహాన్ని కట్టడి చేయలేకపోయారు.

### ఓపెనర్ల నుంచే ఎదురుదాడి

శ్రీలంకకు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. రవిందు రసంత, నిషాన్ మదుష్క భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తొలి వికెట్‌కు 110 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. రసంత 143 బంతుల్లో 71 పరుగులు చేయగా, మదుష్క 66 పరుగులతో రాణించారు. అనంతరం కెప్టెన్ సోనాల్ 51 పరుగులతో జట్టును భారీ స్కోరు దిశగా నడిపించాడు. భారత బౌలర్లలో మానవ్ సుథార్ ఆకట్టుకున్నాడు. 13 ఓవర్లలో కేవలం 33 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ కూడా చెరో రెండు వికెట్లు దక్కించుకున్నారు. గుర్నూర్ బ్రార్‌కు ఒక వికెట్ లభించింది. అయినప్పటికీ లంక బ్యాటర్లను తక్కువ స్కోరుకు కట్టడి చేయడంలో భారత బౌలర్లు విఫలమయ్యారు.

### గిల్‌కు విశ్రాంతి

ప్రాక్టీస్ సెషన్‌లో కుడిచేతి వేలికి గాయమైన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలి రోజు ఆటకు దూరంగా ఉన్నాడు. దీంతో కేఎల్ రాహుల్ తాత్కాలికంగా జట్టు బాధ్యతలు చేపట్టాడు. గిల్ గాయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి వైద్య బృందం పర్యవేక్షిస్తోంది.

### పిచ్‌పై భారత్ అసంతృప్తి!

ప్రాక్టీస్ మ్యాచ్‌కు సిద్ధం చేసిన పిచ్‌పైనా భారత జట్టు యాజమాన్యం అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. సాధారణంగా శ్రీలంక పిచ్‌లు స్పిన్‌కు అనుకూలంగా ఉంటాయి. అయితే ఈ మ్యాచ్ పిచ్‌పై ఎక్కువ గడ్డి ఉండటంతో స్పిన్నర్లకు ఆశించిన సహకారం లభించలేదు. ప్రధాన టెస్టుల్లో స్పిన్‌కు అనుకూలమైన పిచ్‌లు ఎదురయ్యే అవకాశముండగా, సన్నాహక మ్యాచ్‌కు భిన్నమైన పిచ్ ఇవ్వడం వల్ల ఆశించిన ప్రయోజనం దక్కదని భారత జట్టు భావిస్తోంది. రెండు టెస్టుల సిరీస్‌కు ముందు సరైన బౌలింగ్ కూర్పును నిర్ణయించుకోవడంతో పాటు స్థానిక పరిస్థితులకు అలవాటుపడేందుకు ఈ మూడు రోజుల మ్యాచ్ టీమిండియాకు కీలకంగా మారింది.

# కోహ్లీ అండతోనే నా పంచ్‌కు పదును!

- కష్టకాలంలో మూడేళ్లు అండగా నిలిచిన విరాట్
- ఆర్థిక భరోసాతో ఆటపైనే పూర్తిగా దృష్టి
- ఆయన క్రమశిక్షణే నాకు స్ఫూర్తి: సాక్షి చౌదరి
- కామన్వెల్త్ స్వర్ణ విజేత భావోద్వేగ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** బాక్సింగ్ రింగ్‌లో ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపించి కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు స్వర్ణ పతకం అందించిన సాక్షి చౌదరి తన విజయ ప్రయాణం వెనుక ఉన్న ఆసక్తికర విషయాన్ని వెల్లడించింది. టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తన కెరీర్‌లో అత్యంత క్లిష్ట సమయంలో అండగా నిలిచారని తెలిపింది. దాదాపు మూడేళ్లపాటు ఆయన అందించిన ఆర్థిక సహకారం వల్ల ఇతర సమస్యల గురించి ఆలోచించకుండా పూర్తిగా ఆటపైనే దృష్టి పెట్టగలిగానని భావోద్వేగానికి గురైంది. ఐఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సాక్షి చౌదరి మాట్లాడుతూ విరాట్ కోహ్లీ తనకు ఆదర్శమని పేర్కొంది. కెరీర్‌లో ముందుకు వెళ్లేందుకు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో కోహ్లీ, ఆయన ఫౌండేషన్ తనకు అండగా నిలిచాయని తెలిపింది. దాదాపు మూడేళ్లపాటు స్పాన్సర్‌గా వ్యవహరించడం తన కెరీర్‌కు ఎంతో ఉపయోగపడిందని చెప్పింది. ఆ సహకారం వల్ల శిక్షణ, పోటీలపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించగలిగానని సాక్షి వివరించింది. తన ప్రయాణంలో కోహ్లీ అందించిన మద్దతును ఎప్పటికీ మరిచిపోలేనని, జీవితాంతం ఆయనకు కృతజ్ఞురాలిగా ఉంటానని పేర్కొంది. మైదానంలో విరాట్ కోహ్లీ చూపించే క్రమశిక్షణ, నిలకడ తనను ఎంతగానో ప్రభావితం చేశాయని సాక్షి తెలిపింది. ఒత్తిడి ఎంత ఉన్నా లక్ష్యంపై దృష్టి కోల్పోకుండా ముందుకు సాగే కోహ్లీ తీరు తనకు స్ఫూర్తినిస్తుందని చెప్పింది. ఆయన నుంచి లభించిన మద్దతు తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని, అంతర్జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు దోహదపడిందని పేర్కొంది. స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగిన 2026 కామన్వెల్త్ క్రీడల్లో మహిళల 51 కిలోల విభాగంలో సాక్షి చౌదరి స్వర్ణ పతకం సాధించింది. ఫైనల్లో ఇంగ్లాండ్ బాక్సర్ రూబీ వైట్‌ను ఓడించి అగ్రస్థానంలో నిలిచింది. ఈ విజయంతో భారత బాక్సింగ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. సాక్షి వ్యాఖ్యలతో కోహ్లీ ప్రోత్సాహం క్రికెట్‌కే పరిమితం కాకుండా ఇతర క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న యువ క్రీడాకారుల ప్రయాణానికీ అండగా నిలుస్తోందన్న విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది.

# శ్రేయస్‌కు 'మిస్టర్ కూల్ 2.0' కితాబు

- ధోనీ తర్వాత అంతటి 'కూల్' కెప్టెన్ అయ్యరే!
- ఓటముల్లోనూ ప్రశాంతతే అతడి అసలైన బలం
- యువ ఆటగాళ్లపై ఒత్తిడి కాదు.. పూర్తి స్వేచ్ఛ
- అరుపులు.. కేకలు ఉండవు.. అండగా నిలిచే నాయకత్వం
- అయ్యర్ కెప్టెన్సీపై ఆకాశ్ చోప్రా ప్రశంసల జల్లు




**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** భారత క్రికెట్‌లో 'కెప్టెన్ కూల్' అనగానే గుర్తుకొచ్చే పేరు మహేంద్రసింగ్ ధోనీ. ఎంతటి ఉత్కంఠభరిత పరిస్థితుల్లోనైనా ముఖంలో భావోద్వేగాలు కనిపించనివ్వకుండా జట్టును నడిపించడం ధోనీ ప్రత్యేకత. ఇప్పుడు అదే తరహా ప్రశాంతత శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోనూ కనిపిస్తోందని మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ప్రశంసించాడు. ధోనీ తర్వాత అంతటి కూల్ కెప్టెన్‌గా అయ్యర్ కనిపిస్తున్నాడంటూ కితాబిచ్చాడు. భారత టీ20 జట్టు నాయకుడిగా శ్రేయస్ అయ్యర్ ప్రశాంతత, సానుకూల దృక్పథమే అతడి కెప్టెన్సీని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయని చోప్రా పేర్కొన్నాడు. జూన్ 2026లో సూర్యకుమార్ యాదవ్ నుంచి భారత టీ20 కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన అయ్యర్‌కు ఆరంభంలో ఆశించిన ఫలితాలు దక్కలేదు. నాయకత్వం చేపట్టిన తొలి తొమ్మిది మ్యాచ్‌ల్లో భారత్ కేవలం రెండు విజయాలే సాధించింది. అయినప్పటికీ జట్టులో ప్రతికూల వాతావరణం ఏర్పడకుండా ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం నింపడంలో అయ్యర్ పరిణతి చూపిస్తున్నాడని వివరించాడు. 'ది గ్రేట్ ఇండియన్ క్రికెట్ షో' కార్యక్రమంలో ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ.. అయ్యర్ నోటి నుంచి సాధారణంగా ప్రతికూల వ్యాఖ్యలు రావని చెప్పాడు. మనం మాట్లాడే మాటలకు కూడా ప్రభావం ఉంటుందని, సానుకూలంగా ఆలోచిస్తే మంచి ఫలితాలు వస్తాయనే భావనను అయ్యర్ బలంగా నమ్ముతాడని పేర్కొన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆటగాళ్లపై సహజంగానే తీవ్ర ఒత్తిడి ఉంటుందని, అలాంటి సమయంలో కెప్టెన్ లేదా కోచ్ మరింత ఒత్తిడి పెంచకుండా వారిని ప్రశాంతంగా ఉంచడం అత్యంత ముఖ్యమని చోప్రా అభిప్రాయపడ్డాడు. యువ ఆటగాళ్లకు పూర్తి స్వేచ్ఛనిస్తూ వారిలోని అత్యుత్తమ ఆటను బయటకు తీసుకురావడానికి అయ్యర్ ప్రయత్నిస్తున్నాడని ప్రశంసించాడు. మైదానంలో నిరంతరం అరవడం, ఆటగాళ్లపై అసహనం ప్రదర్శించడం కాకుండా తప్పులు చేసినా వారికి అండగా నిలిచే నాయకుడినే యువ క్రికెటర్లు కోరుకుంటారని చోప్రా పేర్కొన్నాడు. శ్రేయస్ అయ్యర్ సరిగ్గా అలాంటి నాయకుడేనని వ్యాఖ్యానించాడు. విజయాలు వెంటనే రాకపోయినా అయ్యర్ అనుసరిస్తున్న ప్రశాంతమైన నాయకత్వ విధానం దీర్ఘకాలంలో భారత జట్టుకు మేలు చేస్తుందని చోప్రా అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా యువ ఆటగాళ్ల మానసిక స్థైర్యాన్ని పెంచడంలో అతడి విధానం కీలకంగా మారుతుందన్నాడు. ఒత్తిడిలోనూ ధోనీ ఎంత ప్రశాంతంగా కనిపించేవాడో, అయ్యర్‌లోనూ అలాంటి లక్షణాలే కనిపిస్తున్నాయని పేర్కొంటూ.. భారత క్రికెట్‌కు మరో 'మిస్టర్ కూల్' దొరికినట్లేనని ప్రశంసించాడు.



# రిటైర్మెంట్ రోజే స్టీవ్ వా ఫోన్!

### రహానే కెరీర్‌కు ఊహించని కొత్త మలుపు
### ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ నుంచి ఆడేందుకు గ్రీన్‌సిగ్నల్
### పరుగుల కోసమే కాదు.. యువ ఆటగాళ్లకు మార్గదర్శకత్వమే లక్ష్యం
### ఆగస్టు 26 నుంచి యూరప్‌లో కొత్త ఇన్నింగ్స్

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోజే భారత మాజీ టెస్టు కెప్టెన్ అజింక్య రహానేకు ఊహించని అవకాశం తలుపుతట్టింది. ఆస్ట్రేలియా దిగ్గజ కెప్టెన్ స్టీవ్ వా నుంచి వచ్చిన ఒక్క ఫోన్ కాల్ రహానే క్రికెట్ ప్రయాణానికి కొత్త మలుపు ఇచ్చింది. యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ తరఫున బరిలోకి దిగేందుకు రహానే సిద్ధమయ్యాడు. తాను రిటైర్మెంట్ ప్రకటించిన రోజే స్టీవ్ వా స్వయంగా ఫోన్ చేసి ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్‌లో చేరాలని ఆహ్వానించినట్లు రహానే వెల్లడించాడు. ఆ ప్రతిపాదనపై ఒక రోజు ఆలోచించిన తర్వాత అంగీకరించినట్లు తెలిపాడు. మరో టీ20 లీగ్‌లో ఆడే అవకాశంగా మాత్రమే కాకుండా తన సుదీర్ఘ అంతర్జాతీయ అనుభవాన్ని యువ క్రికెటర్లతో పంచుకునే వేదికగా దీనిని చూస్తున్నట్లు చెప్పాడు.

### పరుగులే కాదు.. అనుభవం పంచేందుకూ

38 ఏళ్ల రహానే తాను యూరప్‌కు కేవలం పరుగులు చేసేందుకు మాత్రమే వెళ్లడం లేదని స్పష్టం చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో ఏళ్లుగా సంపాదించిన అనుభవాన్ని యువ ఆటగాళ్లకు అందించడం, వారికి మార్గదర్శకుడిగా నిలవడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నాడు. తన ప్రయాణంలో నేర్చుకున్న విషయాలు కొత్త తరానికి ఉపయోగపడితే అదే తనకు గొప్ప సంతృప్తి అని తెలిపాడు. ఐర్లాండ్, నెదర్లాండ్స్ వంటి జట్లు అంతర్జాతీయ క్రికెట్‌లో క్రమంగా మెరుగైన ప్రదర్శన చేస్తున్నాయని రహానే పేర్కొన్నాడు. అక్కడి యువ ఆటగాళ్లలో నేర్చుకోవాలనే తపన కనిపిస్తోందని చెప్పాడు. యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ స్థానిక ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా మారుతుందని అభిప్రాయపడ్డాడు. అంతర్జాతీయ స్టార్ ఆటగాళ్లతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం ద్వారా స్థానిక క్రికెటర్లు వేగంగా ఎదిగే అవకాశం ఉంటుందని వివరించాడు.

### రహానేపై స్టీవ్ వా ప్రశంసలు

ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ సహ యజమాని, చీఫ్ క్రికెట్ ఆఫీసర్ స్టీవ్ వా కూడా రహానేపై ప్రశంసలు కురిపించాడు. రహానే ఆదర్శవంతమైన ప్రొఫెషనల్ క్రికెటర్ అని, అతనిలో నైపుణ్యం, సహనం, నాయకత్వ లక్షణాలతో పాటు వినయం కూడా ఉన్నాయని కొనియాడాడు. తీవ్రమైన ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉండే రహానే స్వభావం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు. ఫ్రాంచైజీ సీఈవో టిమ్ థామస్ సైతం రహానే చేరికను క్లబ్ చరిత్రలో కీలక ఘట్టంగా అభివర్ణించాడు. ఇది కేవలం ఒక స్టార్ ఆటగాడిని జట్టులోకి తీసుకోవడం మాత్రమే కాదని, భవిష్యత్తులో జట్టు సంస్కృతి, ప్రమాణాలను నిర్మించడంలో ఉపయోగపడే కీలక నిర్ణయమని పేర్కొన్నాడు.

### ఆగస్టు 26 నుంచి కొత్త ఇన్నింగ్స్

యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 20 వరకు జరగనుంది. ఐర్లాండ్‌లోని డబ్లిన్, నెదర్లాండ్స్‌లోని ది హేగ్ నగరాలు మ్యాచ్‌లకు వేదిక కానున్నాయి. ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ తరఫున రహానే బరిలోకి దిగనున్నాడు. అతని సుదీర్ఘ అంతర్జాతీయ అనుభవం జట్టుకు అదనపు బలంగా మారుతుందని ఫ్రాంచైజీ భావిస్తోంది.

### 195 మ్యాచ్‌లు.. 8,414 పరుగులు

భారత్ తరఫున రహానే 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 195 మ్యాచ్‌ల్లో 8,414 పరుగులు సాధించాడు. అతని ఖాతాలో 15 సెంచరీలు, 51 అర్ధ సెంచరీలు ఉన్నాయి. జూలై 30న అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు భారత దేశీయ క్రికెట్‌కు కూడా వీడ్కోలు పలికిన రహానేకు ఇప్పుడు విదేశీ ఫ్రాంచైజీ లీగ్‌లలో కొత్త ప్రయాణం మొదలవుతోంది. భారత జెర్సీలో సుదీర్ఘ ఇన్నింగ్స్ ముగించిన రహానే.. ఇప్పుడు యూరప్ గడ్డపై ఎలాంటి ముద్ర వేస్తాడన్నది ఆసక్తికరంగా మారింది.



# ‘బిగ్‌బాస్’లో సాధనా నాయుడు!?

**పదో సీజన్‌లో సోషల్ మీడియా బ్యూటీ సందడి?**

**హౌస్‌లోకి ఎంట్రీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందంటూ ప్రచారం**

**పేరు బయటకు రావడంతో నెట్టింట పెరిగిన ఆసక్తి**

**‘దశావతారం’ కాన్సెప్ట్‌తో పదింతల వినోదానికి రంగం సిద్ధం**

బుల్లితెర బిగ్గెస్ట్ రియాలిటీ షోగా ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ‘బిగ్‌బాస్’ పదో సీజన్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లను పూర్తి చేసుకున్న ఈ కార్యక్రమం ఇప్పుడు ‘బిగ్‌బాస్ 10: దశావతారం’ పేరుతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొత్త సీజన్‌లో పాల్గొనే కంటెస్టెంట్లపై రోజుకో పేరు తెరపైకి వస్తుండగా తాజాగా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సాధనా నాయుడు పేరు జోరుగా వినిపిస్తోంది.

### సాధనా ఎంట్రీ ఖాయమేనా?

బిగ్‌బాస్ పదో సీజన్ కోసం నిర్వాహకులు సాధనా నాయుడిని సంప్రదించారని, ఆమె కూడా హౌస్‌లోకి వెళ్లేందుకు సానుకూలంగా స్పందించిందనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో సాగుతోంది. అయితే ఆమె ఎంపికపై నిర్వాహకుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సాధనా నాయుడు సామాజిక మాధ్యమాల్లో తనదైన కంటెంట్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు. ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్, ట్రావెల్‌తో పాటు రోజువారీ జీవితానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలతో నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. ట్రెండింగ్ రీల్స్, స్టైలిష్ ఫొటోషూట్లతో డిజిటల్ వేదికల్లో తనకంటూ ప్రత్యేక ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు.

### నెట్టింట ఒక్కసారిగా క్రేజ్

బిగ్‌బాస్ కంటెస్టెంట్‌గా సాధనా నాయుడు పేరు ప్రచారంలోకి రావడంతో ఆమె సామాజిక మాధ్యమ ఖాతాలపై నెటిజన్ల ఆసక్తి పెరిగింది. ఆమె హౌస్‌లోకి అడుగుపెడితే తనదైన స్టైల్, వ్యక్తిత్వంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారంటూ అభిమానులు చర్చించుకుంటున్నారు. ప్రతి సీజన్‌లోనూ సినిమా, టెలివిజన్, సామాజిక మాధ్యమాలు సహా వివిధ రంగాలకు చెందిన వారిని హౌస్‌లోకి తీసుకొచ్చే బిగ్‌బాస్ నిర్వాహకులు ఈసారి ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. సాధనా నాయుడు నిజంగానే పదో సీజన్‌లో అడుగుపెడతారా? లేక ఆమె పేరు కూడా ఊహాగానాలకే పరిమితమవుతుందా? అన్నది అధికారిక ప్రకటనతోనే తేలనుంది.





# అమ్మాయిలూ అవకాశాలంటూ నమ్మి రావొద్దు

- సినీ అవకాశాల పేరుతో వేధింపులంటూ యువతి ఆవేదన
- మూడుసార్లు చేదు అనుభవం ఎదురైందని వెల్లడి
- సీరియల్.. సినిమా.. ఫోక్‌సాంగ్.. ఎక్కడికెళ్లినా అదే పరిస్థితంటూ ఆరోపణ
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో
- క్యాస్టింగ్ కౌచ్‌పై మరోసారి చర్చ

**హైదరాబాద్, ఆగస్టు 7:** వెండితెరపై వెలిగిపోవాలని.. నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఎన్నో కలలతో సినీ పరిశ్రమ వైపు అడుగులు వేసే యువతులకు అవకాశాల పేరుతో వేధింపులు ఎదురవుతున్నాయంటూ ఓ సామాజిక మాధ్యమ ప్రభావశీలి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. సీరియళ్లు, సినిమాలు, ఫోక్‌సాంగ్స్‌లో అవకాశాలు ఇప్పిస్తామంటూ తనను సంప్రదించిన సందర్భాల్లో మూడుసార్లు చేదు అనుభవాలు ఎదురయ్యాయని ఆమె ఆరోపించింది. తనలాంటి పరిస్థితి మరెవరికీ ఎదురుకాకూడదనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నట్లు తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో తన ఖాతాలను చూసి సినిమాలు, సీరియళ్లు, షార్ట్‌ఫిల్మ్స్, ఫోక్‌సాంగ్స్‌లో అవకాశాలు ఇస్తామని ఎవరైనా సంప్రదిస్తే గుడ్డిగా నమ్మి వెళ్లవద్దని యువతులకు ఆమె సూచించింది. తాను తొలుత సీరియల్ అవకాశం వచ్చిందని వెళ్లగా అక్కడ అనుచిత ప్రతిపాదన ఎదురైందని, దీంతో వెనక్కి వచ్చేశానని పేర్కొంది. ఆ తర్వాత సినిమా అవకాశం విషయంలోనూ ఇదే తరహా అనుభవం ఎదురైందని ఆరోపించింది. తాజాగా ఫోక్‌సాంగ్‌లో అవకాశం ఇస్తామని పిలవడంతో వెళ్లానని, అక్కడ కూడా తనకు చేదు అనుభవమే ఎదురైందని వాపోయింది. ప్రతిభను చూసి అవకాశాలు ఇస్తారని ఆశపడిన తనకు వరుస అనుభవాలతో తీవ్ర నిరాశ ఎదురైందని తెలిపింది. అవకాశాల పేరుతో యువతులను లొంగదీసుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేసింది. అయితే తనకు ఎదురైన అనుభవాల నేపథ్యంలో భావోద్వేగంతో మాట్లాడిన యువతి.. సినీ రంగంలో ఎదిగిన మహిళలందరిపైనా సాధారణీకరించేలా కొన్ని వ్యాఖ్యలు చేసింది. ప్రతిభతో ఎదిగిన నటీమణుల విజయాలను ప్రశ్నించేలా ఉన్న ఈ వ్యాఖ్యలకు ఆధారాలను మాత్రం ఆమె వెల్లడించలేదు. దీంతో ఆమె వ్యక్తిగత అనుభవాలపై చేసిన ఆరోపణలను మొత్తం చిత్ర పరిశ్రమకు ఆపాదించడం సరికాదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ భారతీయ చిత్ర పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ‘మీటూ’ ఉద్యమ సమయంలో పలువురు నటీమణులు, సినీరంగ మహిళలు తమకు ఎదురైనట్లు చెప్పిన వేధింపులను బహిరంగంగా వెల్లడించారు. అవకాశాల పేరుతో మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అప్పటినుంచే డిమాండ్లు వినిపిస్తున్నాయి. తాజా వీడియో మరోసారి అదే అంశాన్ని తెరపైకి తెచ్చింది. సినీ అవకాశాల కోసం వచ్చే యువతులు వ్యక్తులు, సంస్థల విశ్వసనీయతను నిర్ధారించుకోవాలని, అధికారిక ఆడిషన్లు, నిర్మాణ సంస్థల ద్వారానే అవకాశాలను పరిశీలించాలని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. అవకాశాల పేరుతో ఎవరైనా అనుచిత ప్రతిపాదనలు లేదా వేధింపులకు పాల్పడితే సంబంధిత అధికారులను ఆశ్రయించాలని పేర్కొంటున్నాయి.

# ‘కొరియన్ కనకరాజు’కు అదిరిపోయే ఆరంభం

వరుణ్ తేజ్ హీరోగా నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘కొరియన్ కనకరాజు’ బాక్సాఫీస్ వద్ద శుభారంభం చేసింది. వినూత్నమైన ప్రచారంతో విడుదలకు ముందే మంచి హైప్ సంపాదించుకున్న ఈ చిత్రం, ఇప్పుడు బలమైన అడ్వాన్స్ బుకింగ్స్, ప్రీమియర్ షోల నుంచి వచ్చిన మంచి టాక్‌తో మంచి వసూళ్ల దిశగా దూసుకెళతోంది. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ కెరీర్‌కు ఈ సినిమా విజయం అత్యంత కీలకంగా మారింది. సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తికి అడ్వాన్స్ బుకింగ్స్ అద్దం పట్టాయి. ముఖ్యంగా చివరి 24 గంటల్లో టికెట్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో మాత్రమే సుమారు 33 వేలకు పైగా టికెట్లు అమ్ముడవడం విశేషం. దీనికి తోడు విడుదలకు ముందు రోజు హైదరాబాద్ సహా పలు నగరాల్లో ఏర్పాటు చేసిన పెయిడ్ ప్రీమియర్ షోలకు అద్భుతమైన స్పందన లభించింది. చాలా షోలు హౌస్‌ఫుల్ కాగా, సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా వరుణ్ తేజ్ కామెడీ టైమింగ్, ఆయన నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాలోని కొన్ని కామెడీ సన్నివేశాలు థియేటర్లలో కడుపుబ్బా నవ్విస్తున్నాయని, హారర్‌తో కూడిన వినోదం బాగా వర్కౌట్ అయిందని పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తోంది. ప్రమోషన్ల సమయంలో వరుణ్ తేజ్ వ్యక్తం చేసిన ధీమాకు తగ్గట్టుగానే సినిమా ఉందని ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పెద్ద సినిమాల నుంచి గట్టి పోటీ లేకపోవడం కూడా ‘కొరియన్ కనకరాజు’కు కలిసొచ్చే అంశంగా ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ సానుకూల పరిస్థితుల్లో తొలి వారాంతంలో సినిమా భారీ వసూళ్లను నమోదు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మొత్తంగా మంచి బజ్, పాజిటివ్ టాక్‌తో మొదలైన ‘కొరియన్ కనకరాజు’ వరుణ్ తేజ్‌కు చాలా కాలంగా ఎదురుచూస్తున్న విజయాన్ని అందిస్తుందో లేదో చూడాలి.




Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644